# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 26-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 222 పేజీలు:6 వెల: రూ.1/-


# దేశం గర్వించేలా తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు



హైదరాబాద్, మే25: ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన పోరాటాలు, త్యాగాల ఫలితంగా పార్లమెంట్ ప్రజాస్వామ్య పంథాలో సాధించుకున్న తెలంగాణ స్వరాష్ట్రంలో.. అనతి కాలంలోనే దేశం గర్వించేలా పదేళ్లకు చేరుకున్న తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని.. అమరుల త్యాగాలు గుర్తు చేసుకుంటూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ ఘనకీర్తిని చాటిచెప్పేలా.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు, పండుగ వాతావరణంలో జరుపుకోవాలని ముఖ్యమంత్రి

## దశాబ్ది ఉత్సవాల ఖర్చులకు గానూ రూ. 105 కోట్ల నిధులు విడుదల

కేసీఆర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కార్యచరణపై దిశానిర్దేశం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన కలెక్టర్ల సమావేశం కొనసాగుతోంది. మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ముఖ్యమంత్రి సలహాదారులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, సీఎంవో కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు, డీజీపీ, జిల్లా ఎస్పీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రోజు వారి కార్యక్రమాల గురించి, ఏరోజుకు ఏ కార్యక్రమం చేపట్టాలో కలెక్టర్లకు సీఎం సూచించారు. గ్రామాలు, నియోజకవర్గ, జిల్లాల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి కేసీఆర్ వివరించారు. మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేశారు. దశాబ్ది ఉత్సవాలకు సంబంధించిన ఖర్చులకు గానూ కలెక్టర్లకు రూ. 105 కోట్ల నిధులు విడుదల చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు.

# గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షపై స్టేకు తెలంగాణ హైకోర్టు నిరాకరణ

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షపై స్టే ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) జూన్ 11న నిర్వహించ తలపెట్టిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన రిట్ పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిగింది.అయితే గురువారం ఉదయమే ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. తన కుమార్తె కూడా గ్రూప్ -1 ప్రిలిమ్స్ రాసినందున తాను విచారించలేనని జస్టిస్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. పిటిషన్‌ను మధ్యాహ్నం మరో బెంచ్‌కు పంపిస్తానని లక్ష్మణ్ వివరించారు. ఇవాళ మధ్యాహ్నం జస్టిస్ పుల్లా కార్తీక్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి.. ప్రిలిమ్స్ పరీక్షపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది.వివిధ పోస్టులకు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసినప్పుడు సంబంధిత పరీక్షల మధ్య 2 నెలల వ్యవధి ఉండాలన్న నిబంధనను అమలు చేయకుండా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని 36 మంది అభ్యర్థులు ఆ పిటిషన్‌లో పేరొన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శి, హోం శాఖ కార్యదర్శి, సిట్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది కోర్టు.

# మూసీలో మొండెం లేని తల మృతురాలు ఎర్రం అనురాధగా గుర్తింపు

### -వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న మృతురాలు.. డబ్బు విషయంలోనే హత్య

### -మృతదేహాన్ని ముక్కలు చేసి ఫ్రిజ్‌లో దాచినట్లు అంగీకరించిన నిందితుడు

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నగరంలోని మలక్‌పేట వద్ద మూసీ సమీపంలో మొండెం లేని తల దొరికిన కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై డీసీపీ చెప్పిన వివరాల ప్రకారం... నర్సు అనురాధకు డబ్బు చెల్లించే విషయంలో తలెత్తిన సమస్య విషయంలో నిందితుడు చంద్రమోహన్ కత్తితో దాడి చేసి ఆమెను హత్య చేశాడని డీసీపీ వెల్లడించారు. "12న హత్య చేశాడు. ఆమె ఛాతీ, పొట్టపై కత్తితో గాయపరిచాడు. అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పారవేసేందుకు రెండు స్టోన్ కటింగ్ మెషీన్లను (చిన్నవి) కొనుగోలు చేశాడు. ఆ తర్వాత నిందితుడు తలను నరికి బ్లాక్ కలర్ పాలిథిన్ కవర్‌లో ఉంచాడు. 17న మూసి నదిలో తల పడేశాడు. ఆ తర్వాత కాళ్లు, చేతులను బకెట్, ఫ్రిజ్‌లో ఉంచాడు" అని వివరించారు.కాగా ఇంటిలో మృతదేహం వాసన రాకుండా నిందితుడు ఫినైల్, డెట్టాల్, పెర్ఫ్యూమ్ అగర్‌బత్తి, కర్పూరం, పెర్ఫ్యూమ్ స్ప్రే బాటిళ్లను తీసుకువచ్చి క్లీన్ చేశాడని డీసీపీ వివరించారు. చుట్టుపక్కల దుర్వాసన వ్యాపించకుండా ఉండటానికి వాటిని క్రమం తప్పకుండా మృతురాలి శరీర భాగాలపై చల్లాడని, ఆ తర్వాత నిందితుడు మృతురాలి సెల్‌ఫోన్‌ను తీసుకుని ఆమెకు తెలిసిన వ్యక్తులకు మెసేజ్‌లు పంపి ఆమె బతికే ఉందని, ఎక్కడో ఉంటోందని నమ్మబలికాడని డీసీపీ వివరించారు.కాగా ఆరు రోజుల క్రితం మలక్ పేటలోని మూసీ పరివాహక ప్రాంతం తీగలగూడ వద్ద నల్లటి ప్లాస్టిక్ కవరులో మొండెంలేని తల కనిపించడం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. మృతురాలు ఎర్రం అనురాధ(55)గా గుర్తించారు. ఆమె సోదరి, బావ గుర్తించడంతో పోలీసులు ఆ తల నర్సు అనురాధదేనని తేల్చారు. మృతురాలు వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు, డబ్బు విషయంలోనే హత్యకు గురైనట్లు ఆమె సోదరి వెల్లడించింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని ముక్కలు చేసి ఫ్రిజ్‌లో దాచినట్లు నిందితుడు అంగీకరించాడు.

# చదరంగ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

### -శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మేధో వికాసానికి, బుద్ధి కుశలతకు దోహదం చేసే చదరంగం క్రీడాంశానికి తెలంగాణ ప్రభుత్వం 'సాట్స్' ద్వారా ఎంతో ప్రోత్సాహం ఇస్తోందని సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. తెలంగాణ చెస్ అసోసియేషన్, స్లాన్ (స్పోర్ట్స్ లోకల్ ఎరియా నెట్‌వర్క్) ఆధ్వర్యంలో జూలై 21 నుండి 25వ తేది వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న మొదటి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే చెస్ టోర్నమెంట్ వాల్ పోస్టర్‌ను సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాట్స్ చైర్మన్ మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి రాష్ట్రంలో అన్ని రంగాల మాదిరిగానే గత దశాబ్ది కాలం నుండి క్రీడారంగాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశారని, చెస్ క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఉప్పల ప్రవీణ్, నందిత వీర్లపల్లి లాంటి ఔత్సాహిక చెస్ క్రీడాకారులకు కేసీఆర్ ప్రభుత్వం నగదు ప్రోత్సహకాలు అందించారని ఆయన గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాలు నిర్వహించే టోర్నమెంట్స్ విజయవంతం కావడానికి సాట్స్ తరపున పూర్తిగా సహకరిస్తామని ఆయన తెలిపారు. చంద్రమౌళి, నవీన్ నాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీ టప్పాచబుత్రలో అర్ధరాత్రి ఘాటైన వాసన కలకలం

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పాతబస్తీలోని టప్పాచబుత్రలో అర్ధరాత్రి ఘాటైన వాసన రావడంతో కలకలం రేగింది. ప్రమాదకరమైన వాసన కారణంగా రాత్రంతా స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఆ వాసన భరించలేని విధంగా రావడంతో టప్పాచబుత్ర, యూసుఫ్‌నగర్, కార్వాన్, నటరాజ్‌నగర్, మహేష్ కాలనీలో భయంతో రాత్రంతా స్థానికులు జాగారం చేయాల్సిన దురదృష్టకరమైన పరిస్థితి వచ్చింది. ఇళ్లలో ప్రశాంతంగా నిద్రపోలేని విధంగా ఆ వాసన రావడం కొసమెరుపు. వాంతులు చేసుకుంటూ చిన్నారులు, మహిళల తీవ్ర ఇబ్బందులు పడ్డారు.స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు, డి.ఆర్.ఎఫ్ బృందం ఆ వాసన ఎక్కడ నుంచి వచ్చిందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎంత వెతికినా ఈ వాసన ఎక్కడ నుండి వచ్చిందో పోలీసులు గుర్తించలేకపోయారు. సుమారు గంటన్నర తర్వాత వాసన రావడం ఆగిపోయిందని స్థానికులు తెలిపారు. అర్ధరాత్రి నుంచి వాసన రావడంతో రాత్రంతా రోడ్లపైనే జనం జాగారం చేయడం గమనార్హం. ఆ వాసన ఎక్కడ నుంచి వచ్చిందో, గంటన్నర వ్యవధిలో ఎలా రాకుండా ఆగిందో స్థానికులకు కూడా అర్థం కాలేదు. ఇలాంటి ఘటన జరగడం నగరంలో కొత్తేం కాదు.

గతంలో పారిశ్రామికవాడలకు సమీపంలోని బాలానగర్, జీడిమెట్ల ప్రాంతాలకు సమీపంలోని కొన్ని బస్తీల్లో కూడా ఈ తరహా ఘటనలు హైదరాబాద్ నగరంలో గతంలో చోటుచేసుకున్నాయి. అయితే.. రసాయన వ్యర్థాలు కలవడం వల్ల ఈ తరహా ఘటనలు గతంలో వెలుగుచూశాయి. కానీ.. పాతబస్తీ సమీప ప్రాంతాల్లో ఇలాంటి ఘటన జరగడం మాత్రం ఆ ప్రాంత వాసులను ఆందోళనకు గురిచేసింది.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వానికి మిల్లర్లు సహకరించాలి : మంత్రి గంగుల



హైదరాబాద్, మే25:ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ మిల్లర్లను కోరారు. గురువారం సచివాలయంలో మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో యాసంగి ధాన్యం సేకరణ, సీఎంఆర్ నూక శాతం తదితర వాటిపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ ఎఫ్.ఏ.క్యూ ధాన్యంలో ఒక్క గింజ కోత పెట్టినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా మిల్లర్లు సహకరించాలన్నారు.

ధాన్యం అన్‌లోడింగ్ వెంటనే చేపట్టాలన్నారు. సీఎంఆర్ నిర్ణీత గడువులోగా ముగించాలని సూచించారు. యాసంగి ధాన్యంలో నూక శాతంపై గతంలో ఇచ్చిన నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికను ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవాలో సీఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయిస్తామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వంతో పాటు మిల్లర్లు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సమావేశంలో మంత్రితో పాటు పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్, జీఎం శ్రీనివాసరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంపా నాగేందర్, జనరల్ సెక్రటరీ ఏ.సుధాకర్ రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. ప్రభాకర్ రావ్, ట్రెజరర్ చంద్రపాల్, అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎంసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి సబితా

### -ఇంజినీరింగ్‌లో 80 శాతం ,అగ్రికల్చర్, ఫార్మాలో 86 శాతం ఉత్తీర్ణత



హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ ఎంసెట్ ఫలితాలను మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఇంజినీరింగ్‌లో 80 శాతం ఉత్తీర్ణత, అగ్రికల్చర్, ఫార్మాలో 86 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో సైతం బాలికలదే పై చేయి. ఇంజినీరింగ్‌లో 79 శాతం మంది అబ్బాయిలు, 85 శాతం మంది అమ్మాయిలు క్వాలిఫై అయ్యారు. ఇంజినీరింగ్‌లో అనిరుధ్ అనే విద్యార్థికి మొదటి ర్యాంకు లభించింది. వెంకట మణిందర్ రెడ్డికి సెకండ్ ర్యాంకు లభించింది.కాగా ఈ నెల 10, 11 తేదీల్లో ఎం సెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ స్ట్రీమ్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. 12 నుంచి 15 వరకు ఆరు విడుతల్లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు జరిగాయి. ఇంజినీరింగ్ పరీక్షకు లక్షా 95 వేల 275 మంది విద్యార్థులు హాజరయ్యారు. అగ్రికల్చర్ పరీక్షను లక్షా 6 వేల మంది విద్యార్థులు రాశారు. ఇటీవల ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను విడుదల చేసి అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు.కాగా..ఎంసెట్ఫలితాల కోసం eamcet.tsche.ac.in అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు.తెలంగాణలో 96.35%, ఆంధ్రప్రదేశ్‌లో 92.50% హాజరు నమోదైంది. హైదరాబాద్‌లో అత్యధికంగా 97శాతం మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్ష రాశారు. ఈ నెల 10, 11 తేదీల్లో అగ్రికల్చర్.. 12, 13, 14 తేదీల్లో ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహించారు. అగ్రికల్చర్ ప్రిలిమినరీ కీ ని అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ కీపై అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. అలాగే ఇంజనీరింగ్ ప్రిలిమినరీ కీని ఎంసెట్ కన్వీనర్ ప్రకటించారు. ఈ ఏడాది ఎంసెట్‌కు 3,20,683 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 3,01,789 మంది పరీక్ష రాశారు. 94.11% మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

# రూ.140 కోట్లకు అమ్ముడుపోయిన టిప్పు సుల్తాన్ ఖడ్గం

లండన్ మే 25 : : మైసూర్ రాజు టిప్పు సుల్తాన్ ఖడ్గాన్నిలండన్‌లో వేలం వేశారు. ఆ ఆక్షన్‌లో టిప్పు సుల్తాన్ ఖడ్గం సుమారు రూ. 140 కోట్లకు అమ్ముడుపోయింది. వేలం నిర్వహించిన బాన్‌హమ్స్ హౌజ్ ఈ విషయాన్ని వెల్లడించింది. అంచనా వేసిన దాని కన్నా ఏడు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడుపోయినట్లు బాన్‌హమ్స్ తెలిపింది. 18వ శతాబ్దంలో ఎన్నో యుద్ధాలను గెలిచిన టిప్పు సుల్తాన్ ఈ ఖడ్గాన్ని వాడినట్లు ఆధారాలు ఉన్నాయి. టిప్పు సుల్తాన్‌కు టైగర్ ఆఫ్ మైసూర్ అన్న నిక్‌నేమ్ ఉంది. ఆయన తన సామ్రాజ్యాన్ని అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి రక్షించుకున్నాడు. యుద్ధాల సమయంలో రాకెట్ ఆర్టిల్లరీ వాడాడు. టిప్పు సుల్తాన్ మృతి తర్వాత బ్రిటీష్ మేజర్ జనరల్ డేవిడ్ బయిర్డ్‌కు ఈ ఖడ్గాన్ని అందజేశారు.

# నేడు టీఎస్ పాలిసెట్ -2023 ఫలితాలు విడుదల

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నేడు టీఎస్ పాలిసెట్ -2023 ఫలితాలు విడుదల కానున్నాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఎస్‌బీటీఈటీ సెక్రటరీ డాక్టర్ సీ శ్రీనాథ్ వెల్లడించనున్నారు.మే 17వ తేదీన పాలిసెట్ 2023 పరీక్ష నిర్వహించారు. పదో తరగతి ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన విద్యార్థులు పాలీసెట్ రాశారు. ఈ సెట్‌లో ఉత్తీర్ణులైనవాళ్లు నేరుగా ఇంజినీరింగ్, నాన్ ? ఇంజినీరింగ్, టెక్నాలజీ సంబంధిత డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం ఉంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాల్లో చదువుకునే వీలుంది. అగ్రికల్చర్ డిప్లొమా, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ కోర్సులను ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీలు అందిస్తున్నాయి.మే 17వ తేదీన నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్షకు 92.94 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పాలీసెట్ ప్రవేశ పరీక్షకు 58,520 మంది బాలురు, 47,222 మంది బాలికలు దరఖాస్తు చేసుకున్నారు. 54,700 మంది బాలురు, 43,573 మంది బాలికలు పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 1,05,742 మంది దరఖాస్తు చేసుకోగా, 98,273 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.






# హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి టూర్ ప్యాకేజీని ప్రకటించిన తెలంగాణ టూరిజం

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ టూరిజం మీకోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. హైదరాబాద్ నుంచి కాళేశ్వరం ఒక రోజు టూర్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు పూర్తి వివరాలను ప్రకటించింది. తెలంగాణ టూరిజం అధికారిక వెబ్‌సైట్‌లో ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి.కాళేశ్వరం ప్యాకేజీ టూర్ పేరుతో తెలంగాణ టూరిజం ఈ టూర్ ప్యాకేజీని అందిస్తోండగా.. ప్రతి శనివారం, ఆదివారం ఈ ప్యాకేజీని బుక్ చేసుకోవచ్చు. ఈ టూర్ ప్యాకేజీలో రామలింగేశ్వర స్వామి దేవాలయం మేడిగడ్డ బ్యారేజీ,కనేపల్లి పంప్ హౌజ్ కాళేశ్వర ఆలయంతదితర పర్యాటక ప్రాంతాలు సందర్శించవచ్చు.

### కాళేశ్వరం ప్రయాణం సాగుతుంది ఇలా

ప్రతి శనివారం, ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు బయలుదేరితే వరంగల్‌లోని హరిత కాకతీయ హోటల్‌కు 8 గంటలకు చేరుకుంటారు. బ్రేక్‌ఫాస్ట్ తర్వాత రామప్పలో రామలింగేశ్వర స్వామి ఆలయ దర్శనం ఉంటుంది. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ బ్యారేజీ కనేపల్లి పంప్ హౌజ్ సందర్శిస్తారు. అక్కడనుంచి సాయంత్రం 4 గంటలకు కాళేశ్వర ఆలయ దర్శనంఉంటుంది. ఆ తర్వాత తిరుగు ప్రయాణం మొదలవుతుంది. రాత్రి 11 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. దీంతో టూర్ ముగుస్తుంది.హైదరాబాద్ టూ కాళేశ్వరం టూర్ ప్యాకేజీ ధర। పెద్దలకు రూ.1850, పిల్లలు (5 నుంచి 12సంవత్సరాలు) రూ.1490 చెల్లించాల్సి ఉంటుంది. ఇక టూర్ ప్యాకేజీలో బస్సు టికెట్లు, దర్శనం, హోటల్‌లో వసతి, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ కవర్ అవుతాయి.

# ఆర్థిక సంక్షోభంలోకి జర్మనీ!

న్యూ డిల్లీ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగవ ఆర్థిక వ్యవస్థగా ఉన్న జర్మనీ ఇప్పుడు ఆర్థిక సంక్షోభం లోకి వెళు న్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది తొలి మూడు నెలలు ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం వల్ల జర్మనీ సంక్షోభంలోకి వెళ్లినట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడి ప్రారంభమైన తర్వాత జర్మనీలో గ్యాస్ సరఫరాలు మందగించాయి. దీంతో జనవరి నుంచి మార్చి మధ్య కాలంలో ఆర్థిక వ్యవస్థ 0.3 శాతం కుంచించుకుపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక ట్రేడింగ్‌లోనూ యూరో విలువ పడిపోవడంతో .. జర్మనీ మార్కెట్‌లో లుకలుకలు ప్రారంభం అయ్యాయి. రెండవ క్వార్టర్‌లో కూడా పర్ఫార్మెన్స్ తగ్గడంతో.. జర్మనీ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్నట్లు స్పష్టమైంది.ఏప్రిల్‌లో జర్మనీలో ద్రవ్యోల్బణం 7.2 శాతంగా ఉంది. ఇది యూరో సగటు కన్నా ఎక్కువ. అధిక ధరల భారం ప్రజలపై పడింది. దీంతో ఆహారం, దుస్తులు, ఫర్నీచర్ కొనడం కోసం ప్రజలు ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. అధిక ఇంధన ధరల వల్ల పరిశ్రమల ఉత్పత్తులకు ఆర్డర్లు తగ్గినట్లు గుర్తించారు. ఏడాది ఆరంభం నుంచి ధరలు అధికంగా ఉండడం వల్ల జర్మనీ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడినట్లు డీస్టాటిస్ ఏజెన్సీ ఓ ప్రకటనలో తెలిపింది.

# భారత నేవీ మరో ఘనత.. ఐఎన్ఐ విక్రాంత్‌పై మిగ్29కే నైట్ ల్యాండింగ్ విజయవంతం..!

న్యూఢిల్లీ, మే25: భారత నౌకాదళం మరో ఘనతను సాధించింది. స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై మిగ్-29కే నైట్ ల్యాండింగ్ విజయవంతమైంది. ఈ విషయాన్ని ఇండియన్ నేవీ గురువారం ప్రకటించింది. మిగ్-29కే మొదటిసారిగా రాత్రి సమయంలో ఐఎన్ఎస్ విక్రాంత్‌పై ల్యాండింగ్ చేపట్టి నేవీ మరో చారిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఇది ఆత్మనిర్భర్ భారత్ పట్ల నౌకాదళం ప్రోత్సాహాన్ని సూచిస్తుంది' అంటూ నేవీ ట్వీట్ చేసింది.

సవాల్‌తో కూడిన నైట్ ల్యాండింగ్‌లో విక్రాంత్ సిబ్బంది, నౌకాదళ పైలట్ల సంకల్పం, నైపుణ్యాన్ని ప్రదర్శించారని, వారిని అభినందించాల్సిందేనని పేర్కొంది. ల్యాడింగ్ విజయవంతంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగస్వాములైన సిబ్బంది, అధికారులను ఆయన ప్రశంసించారు. ఇంతకు ముందు మార్చి 28న కమోవ్ 31 హెలికాప్టర్ సైతం ఐఎన్ఎస్ విక్రాంత్‌పై విజయవంతంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. టెస్టింగ్ సమయంలో స్వదేశీ లైటింగ్ ఎక్విప్‌మెంట్స్, షిప్‌బోర్న్ సిస్టమ్స్‌ను వినియోగించగా.. విజయవంతమైందని అధికారులు పేర్కొన్నారు.

ఐఎన్ఎస్ విక్రాంత‌ను కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో నిర్మించారు. దీనికి పొడవు 262 మీటర్లు కాగా.. వెడల్పు సుమారు 62 మీటర్లు. 59 మీటర్ల వరకు ఎత్తు ఉంటుంది. ఇది భారతదేశ తొలి స్వదేశీ నిర్మిత విమాన వాహక నౌక, ఇందులో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ యుద్ధనౌకను 'కదిలే నగరం'గా.. 'బాహుబలి నౌక'గా పేర్కొంటారు. ఐఎన్ఎస్ విక్రాంత్ బరువు దాదాపు 40వేల టన్నులు. ఈ యుద్ధనౌకలో 14 డెక్‌లు, 2300 కంపార్ట్‌మెంట్లు ఉంటాయి. 1700 మంది సిబ్బందికి వసతి ఉంటుంది. ఇందులో మహిళా అధికారుల కోసం ప్రత్యేక క్యాబిన్లు సైతం ఉన్నారు. అలాగే ఐసీయూ నుంచి వైద్య సంబంధిత సేవలు, శాస్త్రీయ ప్రయోగశాలలు సైతం ఏర్పాటు చేశారు.

ఈ యుద్ధ నౌక గరిష్ఠంగా 28 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. అంటే గంటకు 51 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. సాధారణ వేగం 18 నాట్స్. అంటే 33 కిలోమీటర్లు. ఈ వాహక నౌక ఒకేసారి 7500 నాటికల్ మైళ్లు అంటే.. 13వేల కిలోమీటర్లపైగా దూరం ప్రయాణించే సామర్థ్యం ఉంది. ఒకేసారి 30 విమానాలను తీసుకువెళ్తుంది. వీటిలో ఓతిఉ-29ఐ ఫైటర్ జెట్‌లతో పాటు ఐజీఏనీల-31 హెలికాప్టర్లు, ఓఊ-60ఖీ సీహాక్ మల్టీరోల్ హెలికాప్టర్లు, ఊంఐ తయారు చేసిన అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు వంటి ఉన్నాయి. నేవీ కోసం భారత్‌లో తయారు చేసిన తేలికపాటి యుద్ధ విమానం ఒఅం తేజస్ సైతం ఈ వాహక నౌక నుంచి సులభంగా టేకాఫ్ చేయవచ్చు.

### నేటి కందం- నేటికి అందం

కం॥ ప్రనయము మనకోపనమును
వినువీధులలోన నిలుపు విశ్వాసు రుండై
ఘనుడగు నరేంద్ర మోదీ
మనకు ప్రధానిగ చెలగుచు మాన్యత నొసగెన్॥

(మే 25-5-2014 నరేంద్రమోదీ ప్రధానిగా ప్రమాణం)



-రాధశ్రీ
సెల్:9494481210

# పాకిస్థాన్‌లో అసలేం జరుగుతోంది?!

ప్రస్తుతం పాకిస్థాన్‌లో తీవ్ర ఆహార సంక్షోభం, చుక్కలనంటిన నిత్యావసరాల ధరలు, ఆకలి చావులు/కేకలు, ఆర్థిక అస్థిరత్వం, ఐయంయఫ్ లాంటి అంతర్జాతీయ సంస్థల ఆర్థిక చేయూతలు ఆగిపోవడం, పొరుగు దేశాలు కూడా సహాయం చేయడానికి వెనుకంజ వేయడం, తీవ్ర స్థాయిలో అశాంతి మంటలు లాంటి సమస్యలు ముప్పేట దాడి చేయడం హృదయవిదారకంగా ఉన్నది. పాకిస్థాన్‌లోని పలు రాష్ట్రాల్లో ఆహార సరఫరా శృంఖలం తెగిపోవడంతో గోధుమలు దొరక్క జనులు ఆకలితో అలమటించడం, అరకొర గింజల వేటలో కుమ్ములాటలకు దిగడం, తొక్కిసలాటలు జరగడం, ప్రజలు వీధుల్లో తీవ్ర నిరసనలు/ఆందోళనలు చేయడం సర్వసాధారణమైంది. వీటికి తోడుగా విద్యుత్తు, చమురు/ఇంధనం, ఆహార పదార్థాలు, పాలు, మాంసం, కూరగాయలు, నూనెలు, డబ్బుల కొరతతో ద్రవ్యోల్బణం పెరిగి దేశం దివాళా తీసే దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ ధాన్యాలను కొనుగోలు చేయడానికి కిమీ వరకు క్యూ లైన్లు దర్శనమిస్తున్నాయి. పాకిస్థాన్ బలహీణ ఆర్థికవ్యవస్థను గాడిలో పెట్టడానికి రానున్న మూడేళ్లలో కనీసం 16..3 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. కడు పేదరికం, ఆహార కొరత, తీవ్ర వరదలతో కూడిన ప్రకృతి వైపరీత్యాలతో పాకిస్థాన్ గత కొన్నేళ్లుగా అతలాకుతలం అవుతున్నది.

## శ్రీలంక దారిలో దాయాది దేశం:

దాయాది దేశమైన పాకిస్థాన్‌లో నేడు శ్రీలంక దుస్థితే కనబడుతున్నది. ప్రస్తుత పాకిస్థానీ విదేశీమారక (ఫారెక్స్) నిల్వలు 4.6 బిలియన్ డాలర్ల కనిష్ట స్థాయికి చేరడంతో విదేశీ చెల్లింపులకు 3 వారాలు మాత్రమే సరిపోతాయని, తక్షణమే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో పాటు సౌదీ అరేబియా, చైనా, యూఏఈ లాంటి దేశాలు సహాయం చేస్తేనే పాతాళంలోంచి పాక్ ఆర్థికం బలపడే అవకాశం ఉంది. సారవంతమైన నేలలు స్వంతం చేసుకున్న పాకిస్థాన్‌లో ఆహార ధాన్యాల కొరత ఏర్పడడం విచిత్రంగానే తోస్తున్నది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన దాయాది పాక్ ఆర్థిక సంక్షోభ సుడిగుండం నుంచి తేరుకొని బయట పడడానికి సత్వరమే కఠిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాల్సి ఉన్నప్పటికీ ఆ అవకాశాలు కూడా కనిపించడం లేదు.

## వడ్డీల చెల్లింపులకే తంటాలు:

నేటి దుర్భర పరిస్థితుల నుంచి పాకిస్థాన్ గట్టెక్కడానికి అంతర్జాత ద్రవ్య నిధి (ఐయంయఫ్)ని అభ్యర్థించి, వారి షరతులను సంతృప్తి పరిచి రుణం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇదే క్రమంలో ఇరుగు పొరుగు మిత్ర దేశాల నుంచి కూడా రుణం తీసుకొనడానికి ప్రయత్నాలు కొనసాగించాలి. ఐయంయఫ్ విధించే షరతులను అంగీకరిస్తే ప్రజలపై భారం పెరిగి తీవ్ర స్థాయిలో వ్యతిరేక గళాలు వినిపిస్తాయని కూడా హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పాక్ ఆదాయంలో 40 శాతానికి పైగా వడ్డీల చెల్లింపులకు వెచ్చించాల్సి వస్తున్న తరుణంలో పరిష్కార మార్గాలు కనిపించని నిస్సహాయ దుస్థితి ఏర్పడింది.

## ఆకలి అగ్నికి ఆజ్యం పోస్తున్న రాజకీయ అస్థిరత:

ఆహారం కోసం ప్రజలు వీధుల్లో హాహాకారాలు చేయడం జరుగుతున్న వేళ పాకిస్థాన్‌లో రాజకీయ అస్థిరత్వ చీకట్లు అలుముకోవడంతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు అయ్యింది. 2018లో ఆర్మీ సహకారంతో ఇమ్రాన్ ఖాన్ ఎన్నికల్లో నెగ్గి ప్రధానమంత్రిగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన విషయం మనకు విధితమే. ఏప్రిల్ 2022లో ఇమ్రాన్ ఖాన్ నాయకత్వాన పాలన చేస్తున్న ప్రభుత్వాన్ని పీఎంఎల్, పీపీపీ పక్షాలు ఏకమై అవిశ్వాస తీర్మాన నాటకంతో గద్దె దించడంతో ప్రారంభమైన అశాంతి నేటి దుస్థితికి కారణమని విశ్లేషిస్తున్నారు. ఇమ్రాన్ ఖాన్‌పై తీవ్రవాదం, అవినీతి, కోర్టు దిక్కారం లాంటి 150కి పైగా కోర్టు కేసులు నమోదు కావడం జరిగింది. పాక్ మాజీ ప్రధాని, మాజీ ప్రఖ్యాత క్రికెటర్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పిటిఐ) పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ మే 9, 2023న పలు కేసుల్లో నాటకీయంగా పాక్ రేంజర్లు చేత అరెస్టు కావడంతో రెచ్చిపోయిన పార్టీ వీరాభిమానులు దేశవ్యాప్తంగా విధ్వంసకర నిరసనలు చేయడంతో పాక్ ఆర్మీ కార్యాలయాలు, భవనాలు, ప్రాంగణాలపై దాడులు జరగడంతో పరిస్థితులు చేయి దాటడం, ఆర్మీ దళాలు సీరియస్‌గా తీసుకొని కఠిన చర్యలకు పూనుకోవడంతో రాజకీయ అస్థిరత కొనసాగడం జరుగుతున్నది. ఇమ్రాన్ అరెస్టు చట్టవిరుద్ధమని, వెంటనే విడుదల చేయాలని సుప్రీమ్ కోర్టు జోక్యం చేసుకొని బెయిల్ మంజూరీ ఉపశమన తీర్పు ఇవ్వడం జరిగింది. పాక్ ఆర్మీకి వ్యతిరేకంగా వెళ్లడంతో ప్రజాధరణ అధికంగా ఉన్న ఇమ్రాన్ ఖాన్‌కు, ఆర్మీకి మధ్య అగాధం పెరిగిన నేపథ్యంలో నేడు పాకిస్థాన్ ప్రజలు ఆకలితో అలమటించడం ఓ వైపు రాజకీయ అనైతిక చదరంగం ఆట మరో వైపు దేశాన్ని, దేశ అమాయక ప్రజలను మరింత పాతాళ లోతుల్లోకి దిగజార్చుతున్నాయి. తక్షణమే స్వేచ్ఛాయుత వాతావరణంలో, చిత్తశుద్ధితో ఎన్నికలు నిర్వహించి బలమైన ప్రభుత్వ ఏర్పడితేనే పరిస్థితుల్లో కొంత మార్పు రావచ్చని తెలుస్తున్నది. రాజకీయ పరిస్థితులు మరింత దిగజారితే దాయాది దేశంలో ఆర్మీ, ఐయస్ఐ నేతృత్వంలో తిరుగుబాటు తప్పకపోవచ్చని కూడా హెచ్చరిస్తున్నారు.

## సమాధానమే దొరకని సమస్యలెన్నో:

పాకిస్థాన్‌లో తొలిసారి బలమైన ఆర్మీతో ఇమ్రాన్ అభిమాన సైన్యం ఢీ కొనడంతో పరిస్థితులు చేయి దాటాయని విశ్లేషిస్తున్నారు. దీనికి తోడు దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారడం, పౌర సమాజం రాజకీయంగా విచ్ఛిన్నం కావడం, ప్రజలు మెతుకు మెతుక్కు నరకయాతన పడడం, భద్రతా దళాల స్థావరాలను కూడా వదలకుండా ఉగ్రవాద దాడులు జరగడం, రుణాలు ఇచ్చే నాథుడే కరువవడం, విదేశీ మారక నిల్వలు అడుగంటడం, ద్రవ్యోల్బణం పైపైకి చేరడం, ఆర్మీ చేతుల్లో అధికారం విలవిల్లాడడం, ప్రజాస్వామ్య ప్రభుత్వం పరిహాసం పాలు కావడం, అవినీతి మిషతో ఇమ్రాన్ ఖాన్ అరెస్టు, ఈ అరెస్టు ఉదంతంతో ఆగ్రహావేశ విధ్వంసాగ్నిని రాజేయడం లాంటి పలు కారణాలతో పాకిస్థాన్ ఎన్నడూ లేనంత దుర్భర దుస్థితిలోకి పడిపోయింది. ఈ పరిస్థితుల నుంచి బయట పడడానికి మార్గాలు దొరక్క దిక్కులేని దౌర్భాగ్య స్థితిలో దాయాది దేశం ఉన్నది. 2023లోనే ఇప్పటి వరకు పాకిస్థాన్‌లో 436 ఉగ్రదాడులు జరగడం అక్కడి భయంకర పరిస్థితులకు అద్దం పడుతున్నది. నేడు ఇమ్రాన్ ఖాన్ ముందు రెండు మార్గాలు కనిపిస్తున్నాయి. అరెస్టు అనంతరం జైలు శిక్షను ఏండ్ల పాటు అనుభవించడం లేదా లండన్ లాంటి ప్రదేశాలకు శరణార్థిగా వలస వెళ్లి తల దాచుకోవడం అనే మార్గాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకర కూడలిలో ఉన్న పాకిస్థాన్‌లో పరిస్థితులు మెరుగుపడి ప్రజలు శాంతియుతంగా జీవనాలు కొనసాగించాలని మానవీయ కోణంతో అందరం కోరుకుందాం. ఆర్మీ పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు రక్షణ గొడుగులు పట్టాలని ఆశిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037



హైదరాబాద్ లోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు గురువారం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్,జిల్లా ఎస్పీ రమణ కుమార్

# జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలి - జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి

### –విజయవంతంగా ముగిసిన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు



సంగారెడ్డి, మే 25 (నేటి నిజం ప్రతినిధి): జిల్లాను సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి స్థానంలో నిలిపి జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేయాలని జడ్పీ చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అన్నారు. బుధవారం సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రీడలతో క్రీడాకారుల లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వచ్చిందన్నారు.అందరి సమన్వయ సహకారాలతో మండల,జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించు కున్నామన్నారు. ఆత్మ విశ్వాసం, క్రీడా స్ఫూర్తి, పట్టుదలతో ఆడిన క్రీడాకారులందరిని ఆమె అభినందించారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని,అన్నింటిని స్పోర్టివ్ గా తీసుకోవాలన్నారు. ఓటమితో నిరుస్తాహ పడకుండా గెలిచిన వారి మెళుకువలను నేర్చుకుని వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఉద్బోధించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక ఆరోగ్యం బాగుంటుందన్నారు. క్రీడాకారులు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చు కోవాలన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో వివిధ క్రీడలలో గెలుపొందిన (ఫస్ట్,సెకండ్ ప్లేస్ లో నిలిచిన) క్రీడాకారులకు సర్టిఫికేట్ లు, కప్ లను అందజేశారు.

ఈ కార్య క్రమంలో జిల్లా కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డి ఆర్ ఓ నగేష్, సీడీసి,జిల్లా గ్రంధాలయ చైర్మన్లు, జిల్లా అధికారులు, జిల్లా యువజన క్రీడల అధికారి రామ్ చందర్ రావు, క్రీడా అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, పి ఈ టి లు, పిడి లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగ్ వృత్తిని ప్రోత్సహించాలి

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నర్సింగ్ వృత్తిపై అభిమానం తో వచ్చే వారిని ,వారిని ప్రోత్సహించాలని సరోజినిదేవి కంటి ఆసుపత్రి ప్రొఫెసర్ డా.పద్మ ప్రభ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ నిర్వహించిన ఇంటర్నేషనల్ నర్సస్ డే కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన ,సరోజినిదేవి కంటి ఆసుపత్రి ప్రొఫెసర్ డా.పద్మ ప్రభ ధన్యవాదాలు తెలపడానికి ఐ.ఆర్. సి.ఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి మేహదిపట్నం వచ్చి డాక్టర్ ను మెమెంటో ఉ శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మెంబర్స్ జ్యోతి యాదవ్, కల్పన దత్త గౌడ్, రాజు, వెంకట్, సునీత మామిడి, నర్సింగ్ సూపరింటెండెంట్ అజ్మీర్ విజయసత్యనారాయణ ఉ విద్యవతి పాల్గొన్నారు

# ప్రతి చేతి వృత్తుల కుటుంబానికి 5లక్షలు ఇవ్వాలి

### –బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ

జగిత్యాల మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఈరోజు నల్లపోచమ్మ దేవాలయం శివాజీ నగర్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రపంచీకరణ వ్యవస్థలో చేతివృత్తులు కనుమరుగై పోతున్న తరుణంలో కుల వృత్తుల వారికి చేయూతనిచ్చి ఆదుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా కొన్ని కులాలకు మాత్రమే కొన్ని అభివృద్ధి పథకాలు అందించి మిగతా కులాలను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన పాలనలో ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో చేతి వృత్తి పనివారలు బతుకు భారమై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని వారు వాపోయారు. ఇంతకాలం బీసీల్లో కొన్ని కులాలకు మినహా చేతి వృత్తి ఆధారిత కులాలకు ఎటువంటి ఉపయుక్తమైన పథకాలు ప్రకటించకపోవడం శోచనీయమని వారున్నారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీల ఓట్లు దండుకోవడానికి తెరాస ప్రభుత్వం మరోసారి నూతన పథకాల ఆశ చూపిస్తూ మోసపూరితమైన ప్రకటనలు చేయడం సమంజసం కాదని, ఇప్పుడు కొత్తగా చేతివృత్తుల వారికి లక్ష రూపాయలు ఇస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని కుటుంబానికి కేటాయించే లక్ష రూపాయలు ఏ కోశానా సరిపోతాయని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల గంగాధర్ మాట్లాడుతూ చేతివృత్తులకు సంబంధించిన అధునాతన పరికరాల కొనుగోలుకు సైతం రెండు నుంచి ఐదు లక్షల వ్యయం అవుతుందని మరి ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయలు దేనికి సరిపోతాయని ఆయన ప్రశ్నించారు.

దళితబాందవులకు ఇచ్చినట్టుగా బీసీలకు పది లక్షలతో బీసీ బందు ప్రకటించి సత్వరమే అమలు చేయాలని, చేతివృత్తుల వారికి కుటుంబానికి కనీసం ఐదు లక్షలు ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి చింతల గంగాధర్, సంయుక్త కార్యనిర్వహక కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, నియోజకవర్గ అధ్యక్షులు తిరుపురం రాంచందర్, పట్టణాధ్యక్షులు రాపర్తి రవి తో పాటుగా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలి - మంత్రి గంగుల కమలాకర్




సంగారెడ్డి, మే 25 (నేటినిజం ప్రతినిధి): క్షేత్ర స్థాయిలో ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. బుధవారం మంత్రి జిల్లా కలెక్టర్లతో ధాన్యం కొనుగోళ్లు, కస్టమ్ మిల్లింగ్ రైస్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు వాటి తరలింపు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ సీజన్ లో ముందస్తుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి గుర్తు చేశారు. గతేడాది 28.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే పది లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. ఈసారి 4.55 లక్షల మంది రైతుల వద్ద ధాన్యం సేకరించామని తెలిపారు. ధాన్యం దిగుబడులకు అనుగుణంగా అదనంగా 400 కొనుగోలు కేంద్రాలను సైతం అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతులకు ఊరట నందించిందన్నారు. 21 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేశామన్నారు.

కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల పాలకవర్గాల తోడ్పాటుతోనే ఇంత పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలను కొనుగోలు చేయడం సాధ్యపడిందని మంత్రి ఈ సందర్భంగా వారిని అభినందించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల నుండి ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ, వాటిని భద్రపరిచేందుకు వీలుగా అవసరమైన చోట గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి తరుగు తీయకుండా రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం రవాణాకు ఆటంకాలు తలెత్తకుండా అదనపు వాహనాలను సమకూర్చుకోవాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 13,730 మంది రైతుల నుండి 67,230 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని మంత్రికి తెలిపారు. ఇప్పటివరకు 43 కోట్ల 82 లక్షల రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఎస్ఓ వనజాత, డి ఎం సుగుణ బాయ్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, మే 25 (నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని,అందుకు ఆయా అధికారులు ఆయా కార్యక్రమాలను ప్రణాళికతో చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 2వ తేదీ నుండి 22వ తేదీ వరకు 21 రోజులపాటు జిల్లాలో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఆయన జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ జూన్ 2 నుండి 22 వరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్ వివరాలను అధికారులకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల, నియోజకవర్గం, జిల్లా వారిగా నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జాతీయ పతాకావిష్కరణ, దశాబ్ది ఉత్సవ సందేశాలు తదితర, కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. జూన్ 3న తెలంగాణ రైతు దినోత్సవాన్ని, జూన్ 4 న "సురక్షా దినోత్సవం" జూన్ 5న "తెలంగాణ విద్యుత్తు విజయోత్సవం", జూన్ 6న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం", జూన్ 7వ తేదీన "సాగునీటి దినోత్సవం", జూన్ 8న "ఊరూరా చెరువుల పండుగ" నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జూన్ 9 న ''తెలంగాణ సంక్షేమ సంబురాలు", జూన్ 10వ తేదీన "తెలంగాణ సుపరిపాలన దినోత్సవం", జూన్ 11వ తేదీ "తెలంగాణ సాహిత్య దినోత్సవం''గా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జూన్ 12వ తేదీ "తెలంగాణ రన్" నిర్వహించాలని, జూన్ 13 న "తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం", జూన్ 14న "తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని, జూన్ 15 న "తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం'', జూన్ 16వ తేదీ "తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం", జూన్ 17న "తెలంగాణ గిరిజనోత్సవం", జూన్ 18న "తెలంగాణ మంచి నీళ్ల పండుగ" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జూన్ 19న "తెలంగాణ హరితోత్సవం" ను, జూన్ 20 న ''తెలంగాణ విద్యాదినోత్సవం'' నిర్వహించాలని, జూన్ 21న 'తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం", జూన్ 22వ తేదీ ''అమరుల సంస్మరణ" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నుండి జూన్ 22 వరకు నిర్వహించు దశాబ్ది ఉత్సవాలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి,జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీ.సి. బంధు పథకం ప్రవేశ పెట్టాలి

### –లక్షా రూపాయల స్కీము అన్నీ కులాలకు వర్తింప చేయాలి

### –బీ. సి సంక్షేమ శాఖ మంత్రి గంగులకమలాకర్‌తో బీ.సి నే0తల చర్చలు

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గతంలో ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా "బీ.సి. బంధు పథకం'' ప్రవేశపెట్టి ఒక్కొక్క కుటుంబానికి 10 లక్షలు మంజూరు చేయాలని, అలాగే ముఖ్యమంత్రి 5కులాలకు ప్రకటించిన లక్ష రూపాయలు పథకాన్ని బీ.సి జాబితాలోని 130 కులాలకు వర్తింపచేయాలని, వారం రోజులలో ఈ పథకాన్ని అమలు చేయాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం నేత ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో బీ.సి సంక్షేమ శాఖ మంత్రి శ్రీ గంగుల కమలాకార్ తో సచివాలయంలో చర్చలు జరిపారు. 1. బీ.సి బంధు ప్రవేశపెట్టి 10 లక్షల రు!! ఇవ్వాలని,ముక్య మంత్రి ప్రకటించిన లక్ష రు!! బీ.సి. జాబితాలో యున్న 130 కులాలకు మంజూరు చేయాలని, గత ఎన్నికలకు ముందు 201 లతో బీ.సి కార్పొరేషన్ ద్వార తీసుకొని పెండిగులో పెట్టిన 5 లక్షల 47 వేల ధరఖాస్తు ధరులకి వెంటనే రూనలు మంజూరు చేయాలని కోరారు.అలాగే ఇంజనీరింగ్/ఎంబీఏ/ఎంసీఏ/పీజీ/డిగ్రీ/ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసారూ.

# న్యూ ఇయాన్ బిర్యానీ రెస్టారెంట్ ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్

## - భోజన ప్రియుల అభిరుచుల మేరకు రుచికరమైన వంటకాలు అందించి మన్ననలు పొందాలి

## - నాణ్యమైన రుచికరమైన వంటకాలకు కేరాఫ్ గా వుండాలి

ఖమ్మం, మే25: (నేటినిజం ప్రతినిధి): ప్రజలకు నాణ్యమైన రుచికరమైన వంటకాలు భోజన ప్రియులకు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని ఖమ్మం డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఖమ్మం ట్రాఫిక్ ఏసిపి రామోజీ రమేష్, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, బీఆర్ఎస్ ఖమ్మం నగర యూత్ వైస్ ప్రెసిడెంట్ తౌసిఫ్ (బాబి)లు అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని మమత రోడ్ లో గల నూతన రెస్టారెంట్ ను వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం ఆహార వ్యాపారాల విక్రయ కేంద్రాల పోటీతత్వం మరియు ఆదరణ కూడా పెరిగిందని, భోజన ప్రియుల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రుచికరమైన, నాణ్యమైన వంటకాలు అందించి భోజన ప్రియుల మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈసందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులు సయ్యద్ ఉద్దండును వారు అభినందించారు. అనంతరం సయ్యద్ ఉద్దండును..వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు బడే సాహెబ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీ బేగం, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ పుల్ల సాహెబ్, షేక్ మీరా, షేక్ నాగ సైదులు, ఉపాధ్యక్షులు సైదులు, సహాయ కార్యదర్శి షేక్ సిద్దు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుభాని తదితరులు ఉన్నారు.



# బీసీ రాజ్యాధికార సమితిలో కొనసాగుతున్న యువత చేరికలు..

## -క్షేత్ర స్థాయి పటిష్ట నిర్మాణ కార్యక్రమాలను చూసి ఆకర్షితులవుతున్న బీసీ యువత

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీసీల రాజ్యాధికారం కోసం, పటిష్ఠ రాజకీయ నిర్మాణం కోసం క్షేత్రస్థాయి నుండి ఢిల్లీ వరకు అనేక ఉద్యమాలను, పోరాటాలను నిర్వహిస్తూ అన్ని జిల్లాలలో భారీ సమావేశాలను ఏర్పాటుచేస్తూ బీసీల రాజకీయ పునరేకీకరణకు ప్రయత్నాలు కొనసాగిస్తున్న బీసీ రాజ్యాధికార సమితి నాయకత్వంపై ఆకర్షితులై ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున యువకులు బిసి రాజ్యాధికార సమితిలో చేరారు. వరంగల్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు యుగేందర్ యాదవ్ నేతృత్వంలో బత్తుల శంకర్, కందాల సాయినాథ్ గౌడ్, కోడారి రాజయ్య యాదవ్ లను సాదరంగా ఆహ్వానించి కండువాతో బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా దాసు సురేశ్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీల కోసం ప్రత్యేకమైన మేనిఫెస్టోను ప్రకటించని పార్టీలను ఉపేక్షించరాదని,బీసీలకు అసెంబ్లీ సీట్లలో పెద్దపీట వేయని ఏ పార్టీ జెండాను ఎత్తవద్దని బీసీ ప్రజానీకానికి పిలుపునిచ్చారు.. ప్రత్యేక పార్టీ ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందని,బిసి రాజ్యాధికార సమితి ఈ దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడాలి నరేష్, మేకల రాకేష్, కొడారి రాజు, నాగరాజు యాదవ్ , సలీం పాషా , దాసు బలరాం , ముల్క నవీన్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి కె..చంద్రశేఖర్ రావు అధ్యక్షతన దశాబ్ది ఉత్సవాలు, పోడు భూముల పట్టాల పంపిణి పై జిల్లా కలెక్టర్ల థ్ నిర్వహించిన కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి . ఈ సమావేశంలో మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, కార్యదర్శులు, ముఖ్య సలహాదారులు, విసి ప్లానింగ్ బోర్డు, సిఎంఓ అధికారులు పాల్గొన్నారు.

# అమ్మో ..స్పీకర్ పదవా..మాకొద్దు

## - కర్ణాటకలో వెలుగు చూసిన ఉదంతం.. దేశవ్యాప్తంగా చర్చ

బెంగళూర్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):దేశంలో రాజకీయాలకు–సెంటిమెంటుకు మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. నాయకులు అయినా.. పార్టీలైనా సెంటిమెంటుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. అలానే సెంటిమెంటు చూసుకునే పదవులు ఇస్తారు.. చేపడతారు కూడా.ఇప్పుడు కర్ణాటకలో వెలుగు చూసిన ఒక ఉదంతం.. దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. కర్ణాటకలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించిన విషయం తెలిసిందే. దీంతో ఇటీవల ప్రభుత్వం కూడా ఏర్పాటైంది.అయితే రాజ్యాంగం ప్రకారం.. అసెంబ్లీకి స్పీకర్ను ఎన్నుకోవాల్సి ఉంది. ఇది రాజ్యాంగ విధి కూడా. అయితే.. ఇక్కడ చిత్రంగా 136 మంది ఎమ్మెల్యేలు ఉన్నా.. కొందరు మంత్రులుగా పీఠాలు పొందిన మిగిలిన వారిలో ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ పదవిని స్వీకరించేందుకు ముందుకు రాలేదు. అధ్యక్షా అనిపించుకోండి.. అని కాంగ్రెస్ ఆఫర్ ఇస్తే.. మాకొద్దంటే.. మాకొద్దంటూ నాయ కులు తప్పించుకున్నారు.దీనికికారణం సెంటిమెంటు. స్పీకర్ పదవిని స్వీకరించేందుకు ఒక్క కర్నాటకలోనే కాదు.. ఏపీ తెలంగాణ తమిళనాడు కేరళ హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో నూ అధికార పక్షం నాయకులు వెనుకంజ వేస్తున్నారు.దీనికి కారణం స్పీకర్లు గా చేసిన వారు తదుపరి ఎన్నికల్లో విజయం దక్కించుకోలేక పోవడమే. ఏపీ లోనూ.. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్గా చేసిన యనమల రామకృష్ణుడు మళ్లీ గెలవలేదు. ప్రతిభా భారతి మళ్లీ గెలవలేదు. కేఆర్ సురేష్రెడ్డి నాదెండ్ల మనోహర్ కూడా పరాజయం పాలయ్యారు.తెలంగాణలోనూ.. స్పీకర్గా చేసిన మధుసూదనాచారి మళ్లీ గెలవలేదు. హిమాచల్ ప్రదేశ్లో ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో స్పీకర్ ఓడిపోయారు. తమిళనాడులోనూ అలానే జరిగింది. కేరళలోనూ ఓడిపోయారు.దీంతో స్పీకర్ పదవి అంటే.. సెంటిమెంటుగా మారిపోయింది. ఇక తాజా విషయానికి వస్తే.. కన్నడ శాసన సభకు 9 సార్లు ఎన్నికైన మాజీ మంత్రి ఆర్వీ దేశ్పాండే ఏడుసార్లు ఎన్నికైన మాజీ మంత్రి టీబీ జయచంద్ర స్పీకర్ పదవిని స్వీకరించడానికి ససేమిరా అన్నారు.దీంతో కాంగ్రెస్ పెద్దలు ఎట్టకేలకు దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన నేత మాజీ మంత్రి యూటీ ఖాదర్ను ఒప్పించారు. అది కూడా రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవిని ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు.ఒకవేళ వచ్చే ఎన్నికల్లో ఓడిపోతే.. అప్పుడు ఎమ్మెల్సీని చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఎట్టకేలకు ఖాదర్ స్పీకర్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. స్పీకర్ పదవికి ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో బుధవారం జరిగే ఎన్నికల్లో ఏకగ్రీవం ఖాయమైంది.

# మహానాడుకు టీడీపీ శ్రేణులకు చంద్రబాబు సాదరస్వాగతం..

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);27, 28 తేదీల్లో రాజమహేంద్రవరం వేదికగా తలపెట్టిన మహానాడు–2023కు సర్వంసిద్ధమైంది. ఈ మేరకు 'మహానాడు పార్టీ ప్రతినిధుల సభకు ఆహ్వానము' పేరిట పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆహ్వానాలు పంపిస్తున్నారు. తన డిజిటల్ సైన్తో ఉన్న ఆహ్వాన పత్రికలతో పార్టీ కేడర్ను ఆహ్వానిస్తున్నారు.అమరావతి/ రాజమహేంద్రవరం: ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు కదనోత్సాహంతో 'మహానాడు 2023'కు తెలుగుదేశం పార్టీ (సిద్ధమైంది. రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో ఈనెల 27, 28 తేదీల్లో తలపెట్టిన ఈ పసుపు శ్రేణుల పండగకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. మొదటి రోజున ప్రతినిధుల సభ, రెండో రోజున ఎన్టీఆర్ జయంతి, బహిరంగ సభ జరగనున్నాయి. ఈ మేరకు 'మహానాడు పార్టీ ప్రతినిధుల సభకు ఆహ్వానము' పేరిట పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆహ్వానాలు పంపిస్తున్నారు. తన డిజిటల్ సైన్తో ఉన్న ఆహ్వాన పత్రికలతో పార్టీ కేడర్ను ఆహ్వానిస్తున్నారు.

లేఖలో ఏముందంటే....

" తెలుగుజాతి ఔన్నత్యాన్ని, ఆత్మగౌరవాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పిన మన ప్రియతమ నాయకులు, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పునకు నాంది పలికిన యుగపురుషుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి శతజయంతి ఉత్సవాలను మహానాడు వేదికగా మరింత ఘనంగా జరుపుకుంటుంది తెలుగుదేశం. అలానే అన్నగారి జయంతి సందర్భంగా ప్రతి యేటా పార్టీ ప్రతినిధుల మహానాడును మే 27న జరుపుకోవడం మన సంప్రదాయం. రాజమహేంద్రవరం (వేమగిరి)లో నిర్వహిస్తున్న మహానాడులో రాజకీయ, సాంఘిక, ఆర్థిక, ఆరోగ్య, సంస్థాగత అంశాలపై మరియు ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, అప్రజాస్వామిక విధానాలపై చర్చ జరుగుతుంది. మే 28న భారీ బహిరంగ సభకు జరుగుతుంది. ఈ మహానాడులో మీరందరూ భాగస్వాములు కావాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాను... అభినందనలతో మీ నారా చంద్రబాబు నాయుడు" అని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు.

ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి....

టీడీపీ మహానాడుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేదికైన వేమగిరి, రాజమహేంద్రవరం ప్రాంతాలో ముస్తాబయ్యాయి. దీంతో ఆ ప్రాంతమంతా ఇప్పటికే పసుపు వర్ణమయ్యింది. మరోవైపు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతమంది వచ్చినా అందుకు తగ్గట్టుగా పార్టీ ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా భోజనాల కోసం పకడ్బంధీ ఏర్పాట్లు చేశారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ మహానాడులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు డీజీపీకి బుధవారం విజ్ఞప్తి చేశారు. అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు లక్షలాదిగా మహానాడుకు రానున్నందున వారికి రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఎండీని కోరారు. ఈ మేరకు బుధవారం డీజీపీ, ఆర్టీసీ ఎండీలకు వేర్వేరు లేఖలు రాశారు.

# ఉత్తరప్రదేశ్ లోని గౌతమ్ బుద్ధ నగర్ లో మంగళవారం నుంచి కబడ్డీ పోటీతో మొదలైన ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడలు, 2022

న్యూఢిల్లీ, మే25:అట్టహాసంగా మొదలైన పోటీల మొదటి రోజు ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడలు, 2022 ఉత్తరప్రదేశ్ (ఐఎజఉ22జఖ) మంగళవారం గౌతం బుద్ద నగర్ లోని ఎస్ వి ఎస్ పి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో కబడ్డీ ఆటతో మొదలైంది.

ఖేలో ఇండియా ఐఎజఉ22జఖ పోటీల అధికార ప్రారంభోత్సవం గురువారం జరుగుతుంది. ఈ పోటీలలో 200 యూనివర్సిటీలకు చెందిన 4000 మంది క్రీడాకారులు 21 ఆటలలో పోటీపడుతారు.

మొదటి రోజు కబడ్డీ పోటీకి ముందు చిన్న సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన పాఠశాలల విద్యార్థులు తమ అభినయం, నటనతో ఆహుతులను, క్రీడాకారులను ఆకట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ విజేత బబితా నాగర్, అంతర్జాతీయ కుస్తీ సహాయ మంత్రి శ్రీ బ్రిజేష్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ కబడ్డీ పోటీకి హాజరైన ప్రముఖులలో గౌతం బుద్ధ నగర్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మహేశ్ శర్మ, రాజ్య సభ సభ్యుడు శ్రీ సురేంద్ర నాగర్, గౌతంబుద్ధ నగర్ జిల్లా పంచాయత్ చైర్మన్ శ్రీ అమిత్ చౌధరి , శాసనమండలి సభ్యుడు శ్రీ శ్రీచంద్ శర్మ , గౌతంబుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ మనీష్ కుమార్ వర్మ మరియు గౌతంబుద్ధ నగర్ పోలీసు కమిషనర్ శ్రీమతి లక్ష్మి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పేరొందిన క్రీడాకారులు, పారా ఒలింపిక్స్ పతక విజేత శ్రీ వరుణ్ భాటి, మల్లయోధురాలు బబితా నాగర్, ఉత్తర ప్రదేశ్ యోద్ధాస్ కు చెందిన కబడ్డీ ఆటగాళ్లు శ్రీ ఆశిష్ నాగర్ ఉ శ్రీ ఆశు సింగ్ పాల్గొన్నారు. ఆసక్తికరంగా సాగిన నాలుగు కబడ్డీ పోటీలలో మహిళా విభాగంలో జరిగిన మొదటి పోటీలో జింద్ కు చెందిన చౌధరి రణబీర్ సింగ్ యూనివర్సిటీ జట్టు బిలాస్ పూర్ వాజపేయి యూనివర్సిటీ జట్టును 41–28 పాయింట్లతో ఓడించింది. బిలాస్ పూర్ జట్టులో సంజూ దేవి

అసాధారణ ప్రతిభ కనబరచిన పుటికినీ జట్టులోని ఇతర ఆటగాళ్లు ఆమెకు కలసిరాకపోవడంతో చివరి క్షణాల్లో మ్యాచ్ చేజారిపోయింది.

చివర మూడు నిమిషాల సమయం మిగిలి ఉన్నంత వరకు మ్యాచ్ పోటాపోటీగా సాగింది. మహిళా విభాగంలోని రెండవ మ్యాచ్ లో షిమ్లాకు చెందిన హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ దుర్గ్ కు చెందిన హెచ్ సి వై యూనివర్సిటీని 51–29 పాయింట్లతో ఓడించింది. షిమ్లా యూనివర్సిటీ మొదటి నుంచి దూకుడుగా ఆడి ప్రథమార్థంలో 29–11పాయింట్ల ఆధిక్యత సాధించింది. ద్వితీయార్థంలో కూడా అదే జోరు కొనసాగించి మరో 22 పాయింట్లను సంపాదించింది.

# జాతీయ బి.సి సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలుగా డా. పద్మ లత



హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); జాతీయ బి.సి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు డా.ఏ. పద్మ లత నియమితులైనారు ఈ మేరకు జాతీయ బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంట్ లో మహిళా బిల్లు పెట్టి మహిళలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే మహిళ బిల్లులో బి.సి. మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే బి.సి. మహిళల కు రాజ్యాధికారం దక్కుతుంది అని అన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళ బిల్లులో బి.సి. మహిళలకు జనాభా ప్రకారం సబ్–కోటా ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్ధకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ లో మొక్కుబడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నించారు. మహిళ బిల్లు పాస్ కావాలంటే బి.సి మహిళలకు సబ్–కోటా ఇవ్వక తప్పదు. జనాభాలో నగం ఉన్న బి.సి.మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. అనంతరం డా.ఏ. పద్మ లత మాట్లాడుతూ దేశం లో బిసి మహిళల హక్కుల కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.మహిళలు ఒంటింటి కే పరిమితం కారాదని రాజ్యాధికారం లో వాట దక్కినపుడే మహిలా సాదికరికత కు సార్ధకత చేకురగాలదన్నారు. నేడు సమాజం లో మహిళలపై అత్యాచారాలు, వేదింపులు, హత్యలు జరుగుతున్నా వీరి రక్షణ్ కోసం చేసిన చట్టాలు కేవలం కాగితాలకే పరివి ఎతమైనాయని విమర్శించారు.మహిళా చట్టాలు పకడ్బందిగా అమలు చేయాలని పద్మ లత కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు.తమపై గల నమ్మకం తో తనను జాతీయ బి.సి మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు నియమించిన ఆర్.కృష్ణయ్య కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎర్ర సత్యనారాయణ, సి రాజేందర్ ,నాని ముదిరాజ్, కుమార్ యాదవ్, సత్తిబాబు, జీపీటీ కుమార్, పెంకే శ్రీనివాస్, పి. భూషణం తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా గోవిందరాజ స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ





తిరుపతి, మే25: తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం ఉదయం మహాసంప్రోక్షణ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో మే 21 నుండి 25వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. గోవిందరాజస్వామివారి ఆలయ విమాన గోపురానికి బంగారు పూత పూసిన రాగి రేకులు అమర్చేందుకు 2021 సెప్టెంబరు 14న పనులు ప్రారంభించారు. విమాన గోపురం పనులు పూర్తి కావడంతో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 4 నుండి 7.30 గంటల వరకు కుంభారాధన, నివేదన, హోమం, మహాపూర్ణాహుతి, ఉదయం 7.45 నుండి 9.15 గంటల వరకు మిథున లగ్నంలో మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఆ తరువాత అక్షతారోహణం, అర్చక బహుమానం అందించారు.

ఉదయం 11.30 గంటల నుండి భక్తులను స్వామివారి దర్శనం కల్పించారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు, ఆగమ సలహా దారులు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, జెఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏసిఏవో బాలాజీ, డివిఎస్వో వీర్రాజు, డిప్యూటీ ఈవోలు శాంతి, గోవింద రాజన్, ఈఈ మనోహర్, విజివో మనోహర్, ఏఈవో రవి కుమార్, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్ రావు, టెంపుల్ ఇన్ స్పెక్టర్లు ధనంజయులు, రాధా కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విజయవాడలో లుపిన్ డయాగ్నోస్టిక్స్ శాటిలైట్ ల్యాబొరేటరీ ప్రారంభం

అమరావతి, మే25:అంతర్జాతీయంగా ఫార్మా అగ్రగామి లుపిన్ లిమిటెడ్ (లుపిన్) ఆంధ్రప్రదేశ్లోని విజయవాడలో తమ శాటిలైట్ ల్యాబొరేటరీని ఈరోజు ప్రారంభించినట్లు వెల్లడించింది.

అధిక–నాణ్యత కలిగిన పరీక్షా సేవల అవకాశాలను మెరుగుపరచడం, దేశవ్యాప్తంగా డయాగ్నోస్టిక్స్ నెట్వర్క్ను పెంచడం లక్ష్యంగా లుపిన్ డయాగ్నోస్టిక్స్ చేస్తున్న విస్తరణలో ఇది ఒక భాగం. ఈసందర్భంగా లుపిన్ డయాగ్నోస్టిక్స్ సిఈఓ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ? వ్యాధుల నిర్వహణ, తగిన చికిత్సను గుర్తించడంలో ఖచ్చితమైన రోగ నిర్ధారణ తొలి అడుగుగా నిలుస్తుందన్నారు. తమ అత్యాధునిక సాంకేతికత, వ్యక్తిగతీకరించిన స్మార్ట్ నివేదికలతో, రోగులు, వైద్యులు ఆరోగ్య ధోరణులపై విలువైన పరిజ్ఞానం పొందుతారన్నారు. పూర్తి సమాచారంతో ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోగలరన్నారు.

నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలను సరసమైన ధరలో భారతదేశంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని అన్నారాయన. వైద్యులు, రోగులు, వినియోగదారులకు అసమానమైన రోగనిర్ధారణ సేవలను అందించడానికి లుపిన్ డయాగ్నోస్టిక్స్ అంకితం చేయబడిందన్నారు. నాణ్యత, ఖచ్చితత్వం పట్ల తమ స్థిరమైన నిబద్ధతను ప్రదర్శిస్తూ, లుపిన్ నాలుగు ప్రయోగశాలలు ఇప్పటికే ఎన్ఏబీఎల్ గుర్తింపును పొందాయన్నారు. ఈ విజయం నమ్మకమైన నాయకునిగా శ్రేష్ఠతకు ప్రాధాన్యతనివ్వడంలో లుపిన్ డయాగ్నోస్టిక్స్ స్థానాన్ని మరింత పటిష్టం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో లుపిన్ డయాగ్నోస్టిక్స్ సీఈఓ రవీంద్ర కుమార్ తో పాటు లుపిన్ లిమిటెడ్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ ప్రియాంకా చావ్లా పాల్గొన్నారు.

# తిరుమలలో గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపండి

తిరుపతి, మే25:తిరుపతి, తిరుమల ఒక ఆధ్యాత్మిక మహా పుణ్యక్షేత్రం ఇక్కడ గంజాయి డ్రగ్ వాటికి తావు లేదని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో రవి ప్రకాష్ తెలియజేశారు. గురువారం పోలీస్ అతిథి గృహం నందు జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈబి స్టేషన్ లో ఎస్ హెచ్ఓలు పని తీరును సమీక్షించి తగిన సూచనలు సలహాలను అందించి ప్రస్తుతం ముందు వస్తున్న సవాల్ గురించి క్షుణ్ణంగా విసిద్దీకరించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కమిషనర్ ఎం.రవి ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు ఎస్ఈబి వారు సమిష్టిగా 36 ఎన్డిపిఎస్ కేసులో నమోదు చేసి 166 మంది నేరస్తులను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించడం జరిగిందని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగూనంగా మాదకద్రవ్య రహిత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాధనమే లక్ష్యంగా పెట్టుకొని అత్యంత ప్రణాళిక బద్ధంగా రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఇలాంటి సమావేశాలు కూడా ఏర్పాటు చేసి సమీక్షించుకోవడం జరుగుతున్నదని వివరించారు.

పాఠశాలు, కళాశాలలో విద్యాసంస్థల నందు ఎన్డిపిఎస్ చట్టం గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులను చైతన్యవంతులను చేసి భవిష్యత్తులో వారు వారి సహచరులు మాదకద్రవ్యాలను వినియోగించకుండా కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. అందరూ డ్రగ్ కి బానిసలు కారు..

చదు వ్యసనాలకి కానీ కొన్ని పరిస్థితుల ప్రభావం వల్ల జల్సాలకు అలవాటు పడి డబ్బు సంపాదనే ప్రధాన లక్ష్యంగా చేసుకుని జీవించే కొన్ని అసాంఘిక శక్తుల వల్ల యువత పెడదారి పడుతున్నదని తెలియజేశారు. తల్లిదండ్రుల ఆశయాలను తుంగలోద్దెక్కి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు అన్నారు. ఒకవేళ కళాశాలలో ఎవరైనా డ్రగ్ కు అలవాటు పడిన బాధితులు ఎవరైనా ఉన్నట్లయితే వారిని గుర్తించి ఆ విద్యాసంస్థల యాజమాన్యం సహకారంతో వాళ్ళ తల్లిదండ్రుల సమక్షంలో బాధ్యత విద్యార్థులకు పోలీస్ శాఖ కౌన్సిలింగ్ ఇప్పించి వార్డులో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో విద్యా సంస్థల ముందు ఇప్పటికే సుమారు 165 ప్రదేశాల్లో డ్రగ్ గురించి చైతన్యపరిచే హోర్డింగ్లను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పోలీస్ ఎస్ఈబి వారికి ఎక్కడైనా మత్తు పదార్థాల పై సమాచారం తెలిస్తే వెంటనే అక్కడికి చేరుకుని వాటి పూర్వపరాలను కూడా విచారణ చేయడం జరుగుతుందన్నారు.

గత మూడు సంవత్సరాలు కాలంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాలు గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవడం జరుగుతున్నన్నారు. చదు వ్యసనాలు నుండి కాపాడి వారి జీవితంలో వెలుగులు నింపడానికి ప్రత్యేక ప్రణాళికతో పాటు పోలీస్ ఎస్ఈబి ముందడుగు వేయాలి అన్నారు. ఎన్డిపిఎల్ కేసుల్లో సంబంధించి ఉన్న అందరిపై గంజాయి షీట్ ను తెలిసి ఆ సమాచారాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాలకు సమాచారం ఇవ్వడం వలన ఇతర జిల్లాల పోలీసులు వారు కూడా సమాచారం చేరి అప్రమత్తంగా ఉండేందుకు ఎంతగానో ఆస్కారం ఉంటుందన్నారు. పోలీస్. ఎస్.ఈ.బి. ఎక్సైజ్ రైల్వే పోలీస్ ఇతర అన్ని శాఖలను ఈ నిర్దిష్ట ప్రతిష్టాత్మకమైన పనిలో భాగస్వాములను చేసి సమన్వయంతో సమిష్టి కృషితో సత్ఫలితాలు సాధించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా గ్యాంబ్లింగ్ రెడ్ శాండిల్ ఇసుక స్మగ్లింగ్ నాటు సారాయి బెల్ట్ షాపు, ఎన్డిపిఎల్ వంటి వాటిని కూడా అరికట్టేందుకు అన్ని రకాల ప్రణాళికతో సాంకేతిక పరమైన ముందు చూపుతో వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ఈబి జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, గూడూరు ఎస్ఈబి డివిజనల్ అధికారులు, జిల్లాలోని ఎస్ఈబిఎస్ హెచ్ఓలు పాల్గొన్నారు.

# ఈశాన్య ప్రాంతం నూతన వృద్ధి కేంద్రంగా ఎదిగే శక్తి కలిగిఉందని తెలిపిన కేంద్ర డిఓఎన్ఇఆర్ శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి.

న్యూఢిల్లీ, మే25:కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి, డి.ఓఎన్ఇఆర్ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన, ఈశాన్య గ్లోబల్ ఇన్వెస్టర్ల శిఖరాగ్ర సమ్మేళనం ముందస్తు ఏర్పాట్ల సమావేశంలో వివిధ దేశాల రాయబారులనుద్దేశించి ప్రసంగించారు.

ఈశాన్య ప్రాంతంలో గల అవకాశాలు, ఏర్పడనున్న అవకాశాల పై ఈ సమావేశంలో దృష్టిపెట్టారు. అలాగే అంతర్జాతీయంగా పెట్టుబడులు పెట్టేందేకు , కొలాబరేషన్ కుగల అవకాశాల గురించి ఇందులో చర్చించారు.ఈశాన్య ప్రాంతానికి గల సామర్థ్యాన్ని గమనించినపుడు ఇది ఒక కొత్త అభివృద్ధి ఇంజిన్గా రూపుదిద్దుకోగలదని ఆయన నొక్కి చెప్పారు. ఈ దిశగా ఈ పెట్టుబడులు శిఖరాగ్ర సమ్మేళనం చెప్పుకోదగిన మైలురాయిగా పేర్కొన్నారు.గ్లోబల్ ఇన్వెస్టర్లకు అద్భుత వకాశాలున్నాయని, సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన సానుకూల విధానాలను తీసుకువచ్చేందుకు మంత్రిత్వశాఖ కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఈశాన్య ప్రాంతంలో ఉన్న అపార సహజవనరుల గురించి, వ్యవసాయరంగం సామర్థ్యం, వివిధ రకాల ఖనిజసంపద, పునరుత్పాదక ఇంధన వనరుల అందుబాటు గురించి మంత్రి ప్రస్తావించారు. సాంస్కృతిక వైవిధ్యత,

ఈశాన్యప్రాంతం వ్యూహాత్మక ప్రాంతంగాఉండడంతో దీనిని ప్రత్యేకించి దక్షిణాసియా వ్యాపార వాణిజ్యానికి ముఖద్వారంగా తీర్చిదిద్దడం జరుగుతోందని మంత్రి చెప్పారు.

పర్యాటకరంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రత్యేక పర్యాటక అవకాశాల అభివృద్ధి వంటి వాటిలో కొలాబరేషన్ను ప్రోత్సహిస్తున్నట్టు శ్రీ కిషన్ రెడ్డి తెలిపారు.

గత 9 సంవత్సరాలలో ఈ ప్రాంతంలో సాధించిన ప్రగతి గురించి ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. చెప్పుకోదగిన పెట్టుబడులతో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలైన విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వేల అభివృద్ధి సుమారు 5 లక్షల కోట్ల రూపాయలతో విలువగల పెట్టుబడులతో చేపట్టినట్టు ఆయన తెలిపారు.

# తెలంగాణాలోని నాగర్ కర్నూల్ జిల్లాలో రహస్య తాత్కాలిక ప్రయోగశాలను డిఆర్ఐ గుర్తించింది



న్యూఢిల్లీ, మే25:డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లాలో రహస్య తాత్కాలిక ప్రయోగశాలను గుర్తించింది. మరియు 31.42 కిలోల అల్ప్రాజోలం (ఎన్‌డిపిఎస్ చట్టం, 1985 ప్రకారం సైకోట్రోపిక్ పదార్థం) స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసింది. నిర్దిష్ట నిఘా ఆధారంగా తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా, వట్టెం గ్రామం (బిజినేపల్లి మండలం) పొలాల్లోని వ్యవసాయ పొలాల మధ్య మారుమూల పౌల్ట్రీ ఫారంలో అల్ప్రాజోలం తయారీకి సంబంధించిన రహస్య తాత్కాలిక ప్రయోగశాలను గుర్తించారు. ప్రణాళికాబద్ధమైన సోదాల ఫలితంగా 31.42 కిలోల అల్ప్రాజోలం తుది ఉత్పత్తి (అక్రమ మార్కెట్‌లో సుమారు రూ. 3.14 కోట్లు) మరియు తయారీలో ఉపయోగించే యంత్రాలు మరియు ఇతర పరికరాలతో పాటు ప్రక్రియలో ఉన్న మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అల్ప్రాజోలం తయారీలో నిమగ్నమైన వ్యక్తిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోంది.

# బ్యూటీషియన్ ఫ్రీ ట్రైనింగ్ క్లాసెస్.. ప్రారంభించిన ఎమ్మెల్యే అరూరి

వరంగల్, మే25: ఐనవోలు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిఆర్ డిఏ వారి సహకారంతో బ్యూటిషియన్ ఉచిత శిక్షణ తరగతులను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు, యువతులు శిక్షణతో, స్వయం ఉపాధి రంగాలలో ఆర్థిక పరిపుష్టి సాధించగలుగుతారని ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. అందులో భాగంగ అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ద్వారా మహిళలకు కుట్టు మిషన్, బ్యూటిషియాన్ వంటి స్వయం ఉపాధి రంగాలలో ఉచిత శిక్షణ అందించడంతో పాటు వారికీ ఉపాధి అవకాశాలు అందిన్తున్నామని తెలిపారు.

# ఆర్థిక నేరస్థులపై చర్యల విషయంలో తన సంకల్పాన్ని రుషీకేష్లో జరిగే జి20 ఎసిడబ్ల్యుజి సమావేశం

న్యూఢిల్లీ, మే25:ఆర్థిక నేరస్థుల పట్ల ఏమాత్రం ఉపేక్షచూపబోమన్న సంకల్పాన్ని ,ఉత్తరాఖండ్లోని రుషీకేష్ లో జరగనున్న జి20 సమావేశంలో పునరుద్ఘాటించనున్న ఇండియా.

ఈ విషయాన్ని కేంద్ర శాస్త్ర సాంకేతిక వ్యవహారాల శాఖ మంత్రి (స్వతంత్ర), ప్రధానమంత్రి కార్యాలయ సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈవిషయాన్ని తెలిపారు.

ఉత్తరాఖండ్ లోని రుషీకేష్లో మే 25న ప్రారంభమవుతున్న అవినీతి వ్యతిరేక వర్కింగ్ గ్రూప్ (ఎసిడబ్ల్యుజి) రెండో సమావేశంలో,

అంతర్జాతీయంగా అవినీతిని ఎదుర్కొనేందుకు జి20దేశాల మరింత కట్టుబాటుకు ఇండియా ప్రయత్నించనుంది.

ఈ రెండో వర్కింగ్ గ్రూప్ సమావేశానికి పూర్వరంగంగా, నేషనల్ మీడియా సెంటర్ లో డాక్టర్ జితేంద్ర సింగ్ ఈవిషయం వెల్లడించారు.

ఆర్థిక నేరస్థులు దేశం నుంచి పారిపోయి, సులభతర చట్టాలున్న ఇతర దేశాలలో తలదాచుకోకుండా చూసేందుకు ఇండియా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో గట్టి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

2018లో అర్జెంటినా అధ్యక్షతన జరిగిన జి20 సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక నేరస్థులపై చర్యలకు 9 సూత్రాల

అజెండా ఫర్ యాక్షన్ ను ప్రకటించారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఆర్థిక నేరాలకు పాల్పడి దేశంవిడిచి పారిపోయి ఇతర దేశాలలో తలదాచుకునే ఆర్థిక నేరస్థుల ఆస్తులను జి20 దేశాలు స్వాధీనం చేసుకునేందుకు 9 సూత్రాలను ప్రధానమంత్రి అప్పట్లో ప్రకటించారు.

ఆర్థిక నేరసులు పరారై ఇతర దేశాలలో తలదాచుకోకుండా చూసేందుకు , పరస్పరం బలమైన, క్రియాశీల సహకారానికి, ఇండియా పిలుపునిచ్చింది. అలాగా ఈ విషయంలో అంతర్జాతీయ ఒప్పందాల అమలు, అంతర్జాతీయ సహకారం, సకాలంలో తగిన చర్యలకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందిపుచ్చుకునేందుకు, పరారైన ఆర్థిక నేరస్థుల విషయంలో తగిన నిర్వచనం ఇచ్చేందుకు, పరారైన ఆర్థిక నేరగాళ్ల విషయంలో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్కఫోర్స్ (ఎఫ్.ఎ.టి.ఎఫ్) నిర్దేశిత ప్రక్రియల ఆధారంగా చర్యలు తీసుకునేందుకు,

ఆర్థిక నేరగాళ్ల ఆస్తులు గుర్తించిన దానికి సంబంధించి చర్యలు ప్రారంభించేందుకు ఉమ్మడి ప్లాట్ఫారం ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు పిలుపునిచ్చారు.

పై అంశాల ఆధారంగా జి 20 సమావేశం, అవినీతి, ఇతర ఆర్థిక నేరాలతో గల సంబంధాలను అంచనావేయడంతోపాటు,

వాటిని ఎదుర్కొనేందుకు, ఈ విషయంలో పరస్పర సహకారానికి, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని తిరిగివారి వారి స్వదేశాలకు పంపేందుకు,

చోరీ సొత్తును జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా అప్పగించేందుకు చర్యలు తీసుకోవడం పై చర్చించనుంది.

అవినీతిపై పోరాటం విషయంలో వాస్తవిక సహకారం అందించడానికి జి20 దేశాలు తమ కట్టుబాటును ప్రకటించాయి.

అలాగే అవినీతికి పాల్పడిన వారు దాని ద్వారా సంపాదించిన సొమ్మును ఇతర దేశాలలో భద్రపరచడాన్ని అడ్డుకునేందుకు చర్యలు

తీసుకునేందుకు జి 20 దేశాలు సంసిద్ధత తెలిపాయి.

భారతదేశపు ప్రస్తుత ప్రాధాన్యత, అవినీతిపై పోరాటంలో అంతర్జాతీయ సహకారన్ని, గత ఒప్పందాలను

ముందుకు తీసుకెళ్లడం, అవినీతికి పాల్పడి ఇతర దేశాలలో తలదాచుకుంటున్నవారిని వెనక్కు పంపడం,

ఇతర దేశాలలో దాచిపెట్టిన అవినీతి ఆస్తులను

తిరిగి ఆయా దేశాలకు అప్పగించడం వంటివి ఉన్నాయి. ఇది అన్ని జి 20 దేశాలను ప్రస్తుతం వేధిస్తున్న సమస్యగా ఉంది.

ఈ విషయంలో భారతదేశ ప్రతిపాదనకు అంగీకారం లభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు.

జి 20, ఎసిడబ్ల్యుజి సమావేశం ప్రాధాన్యతలను ప్రస్తావిస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్, జి 20 కి ఇండియా అధ్యక్షత,

జి 20 అవినీతి వ్యతిరేక వర్కింగ్ గ్రూప్లో 5 ప్రధాన అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. అవి, అవినీతిపై పోరాటంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం,

ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థల సమగ్రతను కాపాడడం, అవినీతిని నిరోధించడం, అవినీతిని ఎదుర్కోవడంలో అవి బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడడం

వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే అవినీతిని నిరోధించడంలో ఆడిట్సంస్థల పాత్ర, ప్రభుత్వ రంగంలో అవినీతిని ఎదుర్కోవడంలో ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి)

ని ఉపయోగించుకోవడం, వంటివి ఇందులో ఉన్నాయి.

జి 20 ఎసిడబ్ల్యుజిసమావేశానికి సంబంధించిన ముఖ్యమైన విషయం గురించి ప్రస్తావిస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్,

ఇండియా అవినీతి వ్యతిరేక వ్యూహాలలో జెండర్ సెన్సిటివిటి గురించి కూడా ఇండియా ఒక ప్రత్యేక ఈవెంటన్ ను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

2023 మే 25 వ తేదీన, ఉత్తరాఖండ్ లోని రుషీకేష్ లో జరిగే ఎసిడబ్ల్యుజి జి20 రెండోసమావేశం సందర్భంగా దీనిని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఈ సమావేశంలో జి 20 దేశాలకు చెందిన ప్రభుత్వ నిపుణులు, అంతర్జాతీయ సంస్థలకు చెందిన వారు కీలకోపన్యాసం చేయనున్నట్టు తెలిపారు.

క్షేత్రస్థాయిలో భారతీయ గొంతుకను ఈ సందర్భంగా వినిపించడం జరుగుతుందన్నారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో ఇండియా తన

స్వీయ అనుభవాలను ఈ సందర్భంగా ప్రముఖంగా ప్రస్తావించనున్నట్టు చెప్పారు. అవినీతి వ్యతిరేక చర్యలు మహిళాసాధికారతకు ఉపయోగపడినట్టు కూడా ఆయన తెలిపారు.

జి 20 ఎసిడబ్ల్యుజి సభ్యదేశాలు అనుసరించే ఉత్తమ విధానాలకు సంబంధించిన కాంపెండియంను ఇండియా తయారుచేస్తున్నట్టు ఆయన తెలిపారు.

అవినీతిని ఎదుర్కోవడంలో ఆడిటింగ్ పాత్రను ఇందులో ప్రస్తావించనున్నారు. ఇది కీలక ఆడిట్ ఆథారిటీలు, అవినీతి వ్యతిరేక సంస్థలు,

పారదర్శకతను పెంపొందించడానికి, జవాబుదారిత్వానికి, రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా కట్టుబడి ఉండేల చూడడానికి,పబ్లిక్ ఫైనాన్సులో సమర్ధతసాధించడానికి ఈ కాంపెండియం ఉపకరించనుంది. అవినీతి వ్యతిరేక పోరాటంలో

ఇండియాప్రాధాన్యతలను బలోపేతం చేయడానికి, దీనిని మరింత ముందుకు తీసుకుపోవడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

దీనికితోడు, ఇండియా అకౌంటబులిటీ రిపోర్టును 2023 సంవత్సరానికి తయారు చేస్తోంది. పరస్పర న్యాయ సహాయం (ఎం.ఎల్.ఎ) విషయంలో

సమర్థత ప్రొసీజర్లు, ఇతర క్రిమినల్ నేరాలపైపై ప్రత్యేక విశ్లేషణను ఇది అందించనుంది. ఇందుకు సంబంధించిన వివిధ అంశాలను అవగాహన చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుంది.

అవినీతిపై పోరాటంలో అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు, భారతదేశ ప్రాధాన్యతలను ముందుకు తీసుకువెళ్లేందుకు

ఇది ఒక సానుకూల ముందడుగుగా చెప్పవచ్చు.

జి 20 ఎసిడబ్ల్యు జి సమావేశం, ఇండియాకు ఇతర దేశాలతో ఈ విషయమై సంప్రదింపులకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది. అలాగే,

తన దగ్గర ఉన్న సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి, విధాన రూపకల్పనకు, అంతర్జాతీయ సహకారాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి,

ఉపకరిస్తుంది. ఇది అంతా భారతదేశపు అవినీతి వ్యతిరేక ఫ్రేమ్వర్కు ఉపయోగపడనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ (డిఒపిటి) కిచెందిన ఎస్.రాధా చౌహాన్ మాట్లాడుతూ,

జి 20 ఎసిడబ్ల్యుజి సమావేశం తొలి ఎసిడబ్ల్యుజి సమావేశానికి కొనసాగింపు అన్నారు. ఇది జి 20 దేశాలు ఆర్థిక నేరగాళ్ల ఆయా దేశాలలోనేరాలకు పాల్పడి ఇతర దేశాలలో తలదాచుకోకుండా చూసేందుకు

సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, పరస్పరం సహకరించుకోవడం, అలాంటి వారిని నిరోధించడం, పరస్పర న్యాయ సమాచారాన్ని అందించుకోవడం

ఇందుకు సంబంధించి నెట్వర్కింగ్, నిర్వహణాపరమైన ఫ్రేమ్ వర్కు రూపొందించుకోవడం పై ఈ సమావేశంలో దృష్టిపెట్టనున్నట్టు తెలిపారు.

ఈ సమావేశం అవినీతి వ్యతిరేక పోరాటంలో ఆయా దేశాలు పరస్పరం సహకరించుకునేందుకు, సభ్యదేశాలు తీసుకుంటున్న చొరవ

,సమన్వయం గురించి తెలుసుకునేందుకు ఒక వేదికగా ఉపకరించనుంది. దీనివల్ల సభ్యదేశాలు అవినీతి వ్యతిరేక పోరాటంలో మరింతసమర్థతతో చురుకుగా పనిచేయడానికి వీలు ఏర్పడనుంది.

# మిషన్ లైఫ్ "అడాప్ట్ హెల్త్ లైఫ్‌స్టైల్" కింద ధ్యాన శిబిరాన్ని నిర్వహిస్తున్న జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ, మే25:పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2023 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మిషన్ లైఫ్‌పై దృష్టి సారించి జరుపుకోవాలని భావిస్తోంది. 2021 యూనిసెఫ్ కాప్26లో గ్లాస్గోలో జరిగిన ప్రపంచ నాయకుల సదస్సులో సుస్థిరమైన జీవనశైలిని అవలంబించడానికి మరియు ప్రపంచవ్యాప్త సాధనను పునరుజ్జీవింపజేయడానికి ఒక స్పష్టమైన పిలుపునిచ్చిన నేపథ్యంలో లైఫ్ కాన్సెప్ట్ అంటే లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే భావనను గౌరవనీయ ప్రధాన మంత్రి ప్రవేశపెట్టారు. ఈ వేడుకల నేపథ్యంలో దేశవ్యాప్తంగా లైఫ్‌పై భారీ చైతన్యం కల్పిస్తున్నారు.

నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సిఎస్‌సిఎం) గల్ఫ్ ఆఫ్ మన్నార్ మెరైన్ బయోస్పియర్ రిజర్వ్‌లోని తూత్తుకుడి ఫిషింగ్ హార్బర్‌లో మిషన్ లైఫ్ థీమ్‌లను ప్రచారం చేయడానికి మరో చొరవ తీసుకుంది. తూత్తుకుడి ఫిషింగ్ హార్బర్ తమిళనాడులోని అతిపెద్ద మరియు రద్దీగా ఉండే ఫిషింగ్ హార్బర్‌లలో ఒకటి. ఈ నౌకాశ్రయం 250 కంటే ఎక్కువ యాంత్రిక ట్రాలర్‌లకు ఆతిథ్యం ఇవ్వగలదు. ఈ ప్రచారం ద్వారా ఎన్‌సిఎస్‌సిఎం శాస్త్రవేత్తలు మిషన్ లైఫ్ ఇతివృత్తాలు మరియు బాధ్యతాయుతమైన మరియు స్థిరమైన చేపలు పట్టడం, పరిశుభ్రమైన చేపల నిర్వహణ మరియు ప్రాసెసింగ్ మరియు శక్తి మరియు నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించడం యొక్క ప్రాముఖ్యత గురించి 60 మంది మత్స్యకారులు మరియు వల మెండర్లకు అవగాహన కల్పించారు. విడిపోయిన, పోగొట్టుకున్న లేదా విస్మరించబడిన ఫిషింగ్ గేర్ (ఏఎల్‌డిఎఫ్‌జి)ని తిరిగి పొందడం మరియు రీసైక్లింగ్ చేయడంతో సహా ఈ కార్యక్రమాలు ఉద్ఘాటించబడ్డాయి, ఎందుకంటే ఒకే ఏఎల్‌డిఎఫ్‌జి కుళ్ళిపోయే ముందు 600 సంవత్సరాల వరకు సముద్రంలో ఉంటుంది.

ఎన్‌సిఎస్‌సిఎం శాస్త్రవేత్తలు ప్లాస్టిక్ కాలుష్యం అనర్థాలు, ముఖ్యంగా సముద్ర వాతావరణంలో మైక్రోప్లాస్టిక్‌లు, అలాగే ఆహార గొలుసులో వాటి బయోఅక్యుమ్యులేషన్‌ను హైలైట్ చేశారు. మత్స్యకారులు చేపలు పట్టేటప్పుడు ఇంట్లో మరియు పడవలో వ్యర్థాలను వేరుచేసే విధంగా అవగాహన కల్పించారు. సెన్సిటైజేషన్‌లో భాగంగా ఎన్‌సిఎస్‌సిఎం సిబ్బంది ఫిషింగ్-సంబంధిత లిట్టర్ (ఎఫ్ఆంఎల్)ని నియంత్రించడానికి నిర్వహణ వ్యూహాల ఆవశ్యకతను మత్స్యకారులకు వివరించారు. ఎఫ్‌ఆర్‌ఎల్‌ని తీర ఆధారిత మెటీరియల్ రికవరీ సౌకర్యాలకు (ఎంఆర్‌ఎఫ్‌లు) మరియు రిసెప్షన్ సౌకర్యాలకు (ఆర్‌ఎఫ్‌లు) తిరిగి తీసుకురావాలని మత్స్యకారులను ప్రోత్సహించారు. ఫిషింగ్ హార్బర్‌లలో ఎండ్-ఆఫ్-లైఫ్ (ఈఓఎల్) ఫిషింగ్ గేర్‌ల సేకరణ, ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబిలిటీ (ఈపిఆర్), సముద్ర వాతావరణంలో ప్లాస్టిక్ లూప్ (సర్క్యులర్ ఎకానమీ)ని మూసివేయడంలో సహాయపడుతుంది. ఈ "చెత్త కోసం చేపలు పట్టడం" అభ్యాసం "క్లీన్ ఇండియా, క్లీన్ సీస్" మరియు "స్వచ్ఛ్ భారత్ మిషన్" కార్యక్రమాలకు అనుగుణంగా ఉంది. ఇంకా ఎన్‌సిఎస్‌సిఎం శాస్త్రవేత్తలు ఇటువంటి చర్యలు ఎఫ్‌ఆర్‌ఎల్ విలువ గొలుసును పెంచగలవని నొక్కిచెప్పారు. ఇది ఫిషింగ్ నిషేధ కాలంలో ఆదాయ వనరుగా ఉపయోగపడుతుంది. అదనంగా చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార సంఘం అదనపు ఆదాయం మరియు జీవనోపాధి వైవిధ్యం కోసం మత్స్య ఉప ఉత్పత్తులను ఉపయోగించుకోవచ్చని సూచించబడింది. ఈ కార్యక్రమంలో మత్స్యకారులకు సముద్రపు ఆవాసాల సున్నితత్వం, వాతావరణ మార్పులు, ప్రకృతితో మమేకమై జీవించాల్సిన ఆవశ్యకత గురించి సాధారణ పద్ధతిలో బోధించారు. హార్బర్ వద్ద, లైఫ్ థీమ్‌లు స్థిరమైన, పర్యావరణ అనుకూల జీవనశైలిని ప్రోత్సహించే పోస్టర్‌లు మరియు కరపత్రాల ద్వారా ప్రదర్శించబడ్డాయి. జీవిత ప్రతిజ్ఞ మరియు సంతకం ప్రచారంలో చురుకుగా పాల్గొనడం ద్వారా మత్స్యకార సంఘం లైఫ్ మిషన్‌కు తమ మద్దతును తెలియజేసింది.

24 మే 2023న జీబీ పంత్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్మెంట్ (ఎన్ఐహెచ్ఈ)కి చెందిన సెంటర్ ఫర్ ల్యాండ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (సిఎల్‌డబ్ల్యూఆర్‌ఎం) మిషన్ లైఫ్ కింద అల్మోరా జిల్లాలోని కాయలా గ్రామంలో అవగాహన మరియు కార్యాచరణ ప్రచారాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు ఉ పిల్లలు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు మరియు సిఎల్‌డబ్ల్యూఆర్‌ఎం సహాయక సిబ్బందితో సహా మొత్తం 70 మంది పాల్గొన్నారు. పాల్గొనే వారికి లైఫ్ థీమ్స్ పై అవగాహన కల్పించారు. నీటిని ఆదా చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం, వ్యర్థాలను తగ్గించడం, స్థిరమైన ఆహార వ్యవస్థలను అనుసరించడం, శక్తిని ఆదా చేయండం మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు నో చెప్పండం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. గ్రామస్తులు త్రాగడానికి మరియు గృహావసరాలకు ఉపయోగించే వారి ప్రధాన నీటి వనరు (స్ప్రింగ్) నీటి నాణ్యతపై కూడా ప్రదర్శించారు. ఇంకా, "ప్రయాస్ సే ప్రభావ్ తక్" సందేశాన్ని ఇన్సూ గ్రామస్తుల భాగస్వామ్యంతో జీవఅధోకరణం చెందే మరియు నాన్-బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను సేకరించి వేరు చేయడానికి వసంత సమీపంలో స్వచ్ఛత అభియాన్ కూడా నిర్వహించబడింది. కార్యక్రమంలో పాల్గొన్నవారు చివరిగా సెషన్‌ల నుండి వారి అభ్యాసాన్ని మరియు వారి ప్రాంతం యొక్క సహజ వనరులను సంరక్షించడానికి వారు అనుసరించే చర్యలను పంచుకున్నారు. పాల్గొన్న వారందరూ పర్యావరణ అనుకూల అలవాట్లను అలవర్చుకుంటామని లైఫ్ ప్రతిజ్ఞ చేశారు.

మిషన్ లైఫ్ రిక్రియేషన్ క్లబ్ యొక్క భారీ సమీకరణ కోసం జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 24 మే 2023న తన ఉద్యోగుల కోసం మిషన్ లైఫ్ "అడాప్ట్ హెల్త్ లైఫ్‌స్టైల్" కింద కోల్‌కతాలోని జడ్ఎస్ఐలో ధ్యాన శిబిరాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని జడ్ఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ ధృతి బెనర్జీ ప్రారంభించారు. దీనిలో రెండు బ్యాచ్‌లలో సుమారు 100 మంది ఉద్యోగులు వారి రోజువారీ జీవితంలో సాధన కోసం సాధారణ ప్రాణాయామం మరియు ధ్యానం యొక్క పద్ధతులను నేర్చుకున్నారు. శిక్షణ పొందిన మెడిటేషన్ కోచ్ దేబశ్రీ డ్యామ్ ధ్యాన శిబిరాన్ని నిర్వహించారు.

# 76వ ప్రపంచ ఆరోగ్య సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, మే25:76వ ప్రపంచ ఆరోగ్య సర్వసభ్య సమావేశంలో 'అందరికీ ఆరోగ్యం' అనే అంశంపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రసంగించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్,వివిధ దేశాలకు చెందిన ఆరోగ్య శాఖ మంత్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు,

ఆరోగ్య రంగానికి జీ -20, భారతదేశం ఇస్తున్న ప్రాధాన్యత, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలు, డిజిటల్ ఆరోగ్య రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత అంశాలను తన ప్రసంగంలో డాక్టర్ మాండవీయ వివరించారు.

"కోవిడ్ -19 మహమ్మారి రూపంలో ఎదురైన అసాధారణ పరిస్థితులు ఆరోగ్య సంరక్షణ రంగంలో పని చేయడానికి ప్రపంచ దేశాలు కలిసి ముందుకు సాగాయి. దీనివల్ల భవిష్యత్ లో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి అవకాశం ఏపడింది" అని డాక్టర్ మాండవీయ పేర్కొన్నారు. ప్రాంతీయ నెట్‌వర్క్‌ల ద్వారా పరిశోధన, అభివృద్ధి , తయారీ రంగాలను అనుసంధానం చేసి ప్రపంచ డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ కోసం ఒక అంతర్జాతీయ వేదికను ఏర్పాటు చేయాలని డాక్టర్ మాండవీయ సూచించారు. " ప్రపంచ వ్యాప్తంగా అమలు జరిగే ఆరోగ్య వ్యవస్థ వల్ల అన్ని దేశాలకు సురక్షితమైన, అధిక-నాణ్యత, తక్కువ ఖర్చుతో కూడిన వైద్య విధానాలు అందుబాటులోకి వస్తాయి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి కృషి జరగాలి" అని ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్య రంగంలో వ్యత్యాసాలను తగ్గించాల్సిన అవసరం ఉందని డాక్టర్ మాండవీయ స్పష్టం చేశారు. "డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయడం వల్ల ప్రపంచానికి ముఖ్యంగా తక్కువ మరియు మధ్య-ఆదాయం కలిగిన దేశాలకు ప్రయోజనం కలుగుతుంది. డిజిటల్ సాధనాల వినియోగంపై ఏకాభిప్రాయాన్ని సాధించాల్సి ఉంటుంది" అని డాక్టర్ మాండవీయ అన్నారు. " డిజిటల్ ఆరోగ్య వ్యవస్థపై అంతర్జాతీయంగా సాగుతున్న ప్రయత్నాల ద్వారా ఒక సంస్థాగత వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, అవసరాలకు సరిపోయే డిజిటల్ పరిష్కారాలను అందించడం సాధ్యం అవుతుంది " అని ఆయన అన్నారు. భారతదేశం అమలు చేస్తున్న'ని-క్షయ్' విధానాన్ని ప్రస్తావించిన డాక్టర్ మాండవీయ దీని ద్వారా ఆవిష్కరణ , పెట్టుబడికి ని-క్షయ్ ఒక నిదర్శనం అన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనకు భారతదేశం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.క్షయ వ్యాధి సోకిన వారికి చికిత్స అందించడం, చికిత్స అందుతున్న తీరును పర్యవేక్షించడం, చికిత్స వల్ల కలుగుతున్న ప్రయోజనాలు తదితర అంశాలను డిజిటల్ వ్యవస్థ ద్వారా పర్యవేక్షిస్తున్నామని డాక్టర్ మాండవీయ వివరించారు.

ప్రశంసించారు. "అందరికీ ఆరోగ్యం" అనే అంశానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థను డాక్టర్ మాండవీయ ప్రశంసించారు." భారతదేశం అధ్యక్షతన జీ-20 దేశాలు అమలు చేస్తున్న 'ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు' అనే అంశంతో పాటు "అంత్యోదయ భావనకు అనుగుణంగా "అందరికీ ఆరోగ్యం" కార్యక్రమం రూపొందింది" అని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంపై కోవిడ్-19 ప్రభావాన్నితన ప్రసంగంలో వివరించిన డాక్టర్ మాండవీయ మహమ్మారి మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై ప్రభావం చూపినప్పటికీ 'అందరికీ ఆరోగ్యం' అనే నినాదాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి సహకరించిందని అన్నారు.

కేంద్ర ఆరోగ్య మంత్రి ప్రసంగం పూర్తి పాఠం:

ప్రజలందరికి ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో "అందరికీ ఆరోగ్యం" అనే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థకు భారతదేశం అభినందనలు తెలుపుతోంది. సమిష్టి ప్రయత్నాల వల్ల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ మరింత పటిష్టంగా అమలు జరుగుతుంది. భారతదేశం అమలు చేస్తున్న "అంత్యోదయ" కార్యక్రమానికి అనుగుణంగా "అందరికీ ఆరోగ్యం" కార్యక్రమం రూపొందింది. అట్టడుగు స్థాయిలో ఉన్న వారిని చేరుకోవడం లక్ష్యంగా కార్యక్రమాలు అమలు జరగాలి.

ఊహించని విధంగా ఏర్పడిన కోవిడ్-19 సంక్షోభం ప్రపంచం ఐకమత్యంతో కలిసి పనిచేయాలి అన్న భారతదేశ విధానానికి బలం చేకూర్చింది. త ప్రపంచం యొక్క మా ఎజెండాను మరింత బలోపేతం చేసింది. భారతదేశం అనుసరిస్తున్న విధానానికి అనుగుణంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు అనే నినాదాన్ని జీ-20 అధ్యక్ష హోదాలో అమలు చేస్తుందని ప్రకటించారు. ప్రజలందరికి ఆరోగ్య సంరక్షణ అందించడానికి, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు ఎదుర్కోవడానికి , డిజిటల్ ఆరోగ్య వ్యవస్థకు భారతదేశం ప్రాధాన్యత ఇస్తోంది. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి క్రియాశీలక చర్యలు తీసుకోవడానికి భారతదేశం సిద్ధంగా ఉంది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని క్షయ వ్యాధి నివారణ కోసం భారతదేశం నమూనాలను అభివృద్ధి చేసింది. వాస్తవికమైన అంశాల ప్రాతిపదికపై రూపొందిన ప్రణాళిక అమలు జరుగుతోంది.

ఆరోగ్య సంరక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి భారతదేశం చర్యలు అమలు చేస్తున్నది. దీనిలో భాగంగా అమలు చేస్తున్న 'ని-క్షయ్' విధానంలో వ్యాధి సోకిన వారికి చికిత్స అందించడం, చికిత్స అందుతున్న తీరును పర్యవేక్షించడం, చికిత్స వల్ల కలుగుతున్న ప్రయోజనాలు డిజిటల్ విధానంలో పర్యవేక్షణలో ఉన్నాయి.

దీనివల్ల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, అవసరాలకు సరిపోయే కోసం సరిపోయే డిజిటల్ పరిష్కారాలను అందించడం సాధ్యం అవుతుంది.

దీనివల్ల అన్ని దేశాలకు సురక్షితమైన, అధిక-నాణ్యత, తక్కువ ఖర్చుతో కూడిన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ఒక సంస్థాగత వ్యవస్థగా పని చేస్తుంది. డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ వల్ల ప్రపంచానికి ముఖ్యంగా తక్కువ, మధ్య-ఆదాయ దేశాలకు డిజిటల్ సాధనాలు అందుబాటులోకి వస్తాయి. దీనిపై ఏకాభిప్రాయ సాధన కోసం భారతదేశం కృషి చేస్తుంది. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై కోవిడ్ ప్రభావం ఉన్నప్పటికీ లక్ష్య సాధన కోసం ప్రపంచ దేశాలు కలిగి ముందుకు సాగాలి. అందరికీ ఆరోగ్యం అనేది ఒక గొప్ప ఆకాంక్ష మాత్రమే కాదు, కీలకమైన ఆవశ్యకత.

# 'ఒకే భూమి, ఒకే ఆరోగ్యం' మరియు ప్రపంచ సమాజానికి సేవ చేయాలనే దృక్పథంపై ఆధారపడి ఉన్నాయి: డాక్టర్ మన్సుఖ్ మాండవియా

న్యూఢిల్లీ, మే25:జెనీవాలోని 76వ వరల్డ్ హెల్త్ అసెంబ్లీలో "హీల్ ఇన్ ఇండియా ఉ హీల్ బై ఇండియా" అనే అంశంపై జరిగిన సైడ్ ఈవెంట్ సెషన్‌లో కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా కీలకోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ ఎస్ గోపాలకృష్ణన్ పాల్గొన్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ మాండవియ మాట్లాడుతూ "ఒక భూమి-ఒకే ఆరోగ్యం మరియు ప్రపంచ సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో గౌరవనీయమైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో హెల్త్ వర్క్‌ఫోర్స్ మొబిలిటీ ఉ పేషెంట్ మొబిలిటీ మద్దతుతో విలువ ఆధారిత ఆరోగ్య సంరక్షణ కోసం భారత ప్రభుత్వం చొరవ తీసుకుంది. 'వసుధైవ కుటుంబం' (ప్రపంచం ఒకే కుటుంబం) యొక్క భారతీయ తత్వశాస్త్రం ప్రకారం ప్రపంచానికి సేవ చేయడానికి భారతదేశం నుండి ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు ఆరోగ్య శ్రామిక శక్తిని పెంచే ఉద్దేశ్యంతో 'హీల్ బై ఇండియా' కార్యక్రమం రూపొందించబడింది. 'హీల్ ఇన్ ఇండియా' చొరవ భారతదేశంలో ప్రపంచానికి "సమగ్ర మరియు సంపూర్ణ చికిత్స'' అందించడానికి ప్రయత్నిస్తుంది మరియు ప్రపంచ స్థాయి, సరసమైన మరియు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలకు ప్రాప్యత కోసం రోగుల చైతన్యాన్ని మెరుగుపరుస్తుంది" అని ఆయన చెప్పారు.

డాక్టర్ మాండవీయ మాట్లాడుతూ ''భారతదేశం ప్రపంచంలోనే అత్యంత పురాతన వైద్య విధానాలైన ఆయుర్వేదానికి నిలయం. దాని ప్రత్యేక బలాలు తెరపైకి రావడంతో ఆయుర్వేదం, యోగా, సిద్ధ, యునాని మరియు హోమియోపతి వంటి ఆయుష్ చికిత్సలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది మరియు అదే ప్రచారం చేయబడింది.

భారతదేశ జీ20 ప్రెసిడెన్సీ ఫిలాసఫీ అయిన "ఒకే భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు"ను హైలైట్ చేస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రి " జీ20 హెల్త్ ట్రాక్ క్రింద, భారతదేశం ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, నివారణ, సంసిద్ధత మరియు ప్రతిస్పందనకు ప్రాధాన్యతనిచ్చి ఒక ఆరోగ్యం మరియు యాంటీ-మైక్రోబయల్ రెసిటెన్స్(ఏఎంఆర్)పై దృష్టి సారించిందని పునరుద్ఘాటించారు. సురక్షితమైన, ప్రభావవంతమైన, నాణ్యమైన మరియు సరసమైన వైద్యపరమైన ప్రతిఘటనలకు అంటే టీకాలు, థెరప్యూటిక్స్ మరియు డయాగ్నస్టిక్స్ మరియు డిజిటల్ హెల్త్ ఆవిష్కరణలు మరియు సార్వత్రిక ఆరోగ్య కవరేజీకి సహాయపడే పరిష్కారాలు మరియు అట్టడుగు స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడానికి ప్రపంచవ్యాప్తంగా ఫార్మాన్యూటికల్ రంగంలో సహకారాన్ని బలోపేతం చేయాలన్నారు.

భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలను నొక్కిచెప్పిన డాక్టర్ మాండవియా, "భారతదేశం ఊహించలేని విధంగా కోవిడ్ వ్యాక్సినేషన్‌ను సాధించింది మరియు భారతదేశంలో ఇప్పటివరకు 2.20 బిలియన్లకు పైగా వ్యాక్సిన్ డోస్‌లు అందించబడ్డాయి. 'వ్యాక్సిన్ మైత్రి' చొరవ ద్వారా మిలియన్ల కొద్దీ వ్యాక్సిన్‌లు ప్రపంచంతో పంచుకోబడ్డాయి" అని చెప్పారు.

స్థితిస్థాపకమైన ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి ఆరోగ్య సంరక్షణ యొక్క అన్ని అంశాలను కవర్ చేయడానికి భారతదేశం ఆయుష్మాన్ భారత్ ఇనిషియేటివ్‌ను ప్రారంభించిందని కేంద్ర ఆరోగ్య మంత్రి పేర్కొన్నారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వ నిధులతో కూడిన ఆరోగ్య బీమా పథకం - ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబిపిఎం-జేఎవై) 2018లో ప్రారంభించబడింది. 1,50,000 ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు (ఏబి-హెచ్‌డబ్ల్యుసిఎస్) సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ పంపిణీని మారుస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబిడిఎం) సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థలోని వివిధ వాటాదారుల మధ్య అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. మరియు పిఎం-ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ వ్యాధి నిఘా వ్యవస్థను నిర్మించడం, ప్రయోగశాల నెట్‌వర్క్‌లు, దేశవ్యాప్తంగా అంటు వ్యాధుల నివారణ బ్లాకులను నిర్మించడం మరియు ఒక ఆరోగ్య విధానానికి ప్రాధాన్యతనిస్తూ పరిశోధన సామర్థ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది" అని ఆయన చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై కోవిడ్-19 మహమ్మారి ప్రభావాన్ని నొక్కి చెబుతూ డాక్టర్ మాండవియ ఇలా అన్నారు, ''ఆరోగ్య ముప్పులు జాతీయ సరిహద్దులకే పరిమితం కాలేదని మరియు సమన్వయంతో కూడిన ప్రపంచ ప్రతిస్పందన అవసరమని మహమ్మారి నిరూపించింది. ఈ సందర్భంలోనే భారతదేశం ఆరోగ్య సంరక్షణ కార్మికుల సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు, డిజిటల్ టెక్నాలజీని ముందుకు తీసుకెళ్లేందుకు తోడ్పడుతోంది"

ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులందరికీ డాక్టర్ మాండవ్య ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు."'అందరికీ ఆరోగ్య సంరక్షణ' అనేది మన గౌరవప్రదమైన ప్రధాన మంత్రి "సబ్కా సాత్, సబ్కా వికాస్ ఉ సబ్కా ప్రయాస్''గా పేర్కొన్న భారతదేశ మార్గదర్శక తత్వశాస్త్రంతో సమలేఖనం చేయబడిందని దీని అర్థం "సమిష్టి ప్రయత్నాల ద్వారా కలిసి కృషి చేయడం'' అని ఆయన పునరుద్ఘాటించారు.

# పెళ్లికి భారీగా ఖర్చు చేస్తున్నారా?..

## -విడాకులు తీసుకునే అవకాశం ఎక్కువ !

## -ఓ అధ్యయనం వెల్లడి

న్యూ ఢిల్లీ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రెండు మనసులు ముడిపడటమే పెళ్లి. అంగరంగ వైభవంగా జరిగే ఈ వేడుకలో ఎటు చూసినా కోలాహలమే కనిపిస్తుంది. అయితే, జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ఈ వేడుకను జీవితాంతం గుర్తుండి పోయేలా సెలబ్రేట్ చేసుకోవాలని అనుకుంటున్నారు.. నేటి తరం యువతీ యువకులు. ఎంగేజ్‌మెంట్ రింగ్స్ నుంచి.. ఫొటోలు, గిఫ్ట్స్, బంగారు ఆభరణాలు, వెడ్డింగ్ డ్రెస్సెస్ అన్నీ చాలా గ్రాండ్‌గా, రిచ్‌గా కనిపించేలా చూసుకుంటున్నారు. ఇందుకోసం ఎంత ఖర్చుకైనా వెనకాడటం లేదు. కొందరు చేతిలో డబ్బులేకపోయినా లోన్స్ తీసుకుని మరీ వివాహ వేడుకలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. అయితే, ఇలా వివాహ వేడుకలకు ఎక్కువ ఖర్చు చేసే జంటలు విడిపోయే అవకాశం ఎక్కువగా ఉందని ఓ అధ్యయనం వెల్లడించింది.

అమెరికాలో ఎకనామిక్స్ ప్రొఫెసర్లు 3,000 కంటే ఎక్కువ మంది వ్యక్తులపై సర్వే చేశారు. ఇందులో ఎంగేజ్‌మెంట్ రింగ్, వివాహ వేడుకకు అయ్యే ఖర్చును వీరు విశ్లేషించారు. ఈ విశ్లేషణలో ఖరీదైన నిశ్చితార్థపు ఉంగరాన్ని కొనుగోలు చేసే జంట విడాకులు తీసుకునే అవకాశం ఎక్కువగా ఉందని గుర్తించారు. రింగ్ ధర రూ. 1.6 లక్షల నుంచి రూ. 3.3 లక్షలు మధ్య ఉంటే.. ఆ జంట విడాకులు తీసుకునే ప్రమాదం 1.3 రెట్లు ఎక్కువగా ఉందని అధ్యయనం కనుగొంది.

ఇక వేడుకల ఖర్చు విషయానికి వస్తే.. ఖరీదైన వివాహాలతో పోలిస్తే తక్కువ ఖర్చుతో పెళ్లి చేసుకున్న జంటలు విజయవంతంగా తమ వైవాహిక జీవితాన్ని గడుపుతాయని అధ్యయనంలో వెల్లడైంది. రూ. 82,000 కంటే తక్కువ ఖర్చుతో వివాహం చేసుకున్న జంటలు విడాకులు తీసుకునే అవకాశాలు చాలా

# కొత్త పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ఓపెన్ చేయాలి..

## - సుప్రీంకోర్టులో దాఖలైన పిల్

న్యూ ఢిల్లీ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఢిల్లీలో కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని ఈనెల 28వ తేదీన ప్రధాని మోదీ ప్రారంభించనున్న విషయం తెలిసిందే. అయితే కొత్త పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ముర్ము చేత ఓపెనింగ్ చేసేలా లోక్‌సభ సెక్రటేరియట్, కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టులో ఇవాళ పిల్ దాఖలైంది. సుప్రీంకోర్టు లాయర్ సీఆర్ జయ సుకిన్ ఈ పిటిషన్ ఫైల్ చేశారు. కొత్త పార్లమెంట్ భవన ప్రారంభోత్సవ సెర్మనీలో రాష్ట్రపతి పేరును చేర్చలేదని, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లు ఆ పిల్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ అనేది సుప్రీం లెజిస్లేటివ్ సంస్థ అని, పార్లమెంట్‌లో రాష్ట్రపతి, ఉభయసభలు కూడా ఉంటాయని పిటిషన్‌లో తెలిపారు. ఉభయసభలకు సమన్లు జారీ చేసే, ప్రొరోగ్ చేసే అధికారం రాష్ట్రపతికి ఉందని ఆ పిల్‌లో చెప్పారు. రాష్ట్రపతిని ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం అసంబద్ధంగా ఉందన్నారు.

# బత్తిన సోదరుల చేప ప్రసాదం పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు : మంత్రి తలసాని



హైదరాబాద్, మే25:కరోనా కారణంగా మూడు సంవత్సరాల పాటు నిలిపివేసిన ఉచిత చేప ప్రసాదం పంపిణీ జూన్ 9న తిరిగి ప్రారంభించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏర్పాట్లపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మృగశిర కార్తె సందర్భంగా బత్తిన సోదరులు అస్తమా బాధితులకు జూన్ 9 వ తేదీన నిర్వహించే చేప ప్రసాదం పంపిణీకి ప్రభుత్వం తరుపున పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. బత్తిన హరినాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు వంశపారం పర్యంగా 170 సంవత్సరాల నుంచి చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారని తెలిపారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందని వెల్లడించారు. చేప ప్రసాదం కోసం మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, వివిధ దేశాల నుంచి కూడా లక్షలాది మంది వస్తుంటారని వివరించారు. బత్తిన సోదరుల నివాసం నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కు పోలీస్ ఎస్కార్ట్ తో ప్రసాదం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రి తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పంపిణీకి అవసరమైన చేప పిల్లలను ప్రభుత్వమే మత్స్య శాఖ ఆధ్వర్యంలో సరఫరా చేస్తుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్ క్యాంపులు, అంబులెన్స్ లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. చేప ప్రసాదం కోసం వివిధ రాష్ట్రాల నుంచి ఒకటి, రెండు రోజులు ముందే ఎగ్జిబిషన్ గ్రౌండ్ కు చేరుకుంటారని చెప్పారు. వారికి జైశ్వాల్ సమాజ్, అగర్వాల్ సమాజ్, శ్రీకృష్ణ కమిటీ, బద్రి విశాల్ పిట్టి వంటి పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో అల్పాహారం, భోజనం అందించే ఏర్పాట్లు చేస్తుంటారని తెలిపారు. ఈ సమావేశంలో బత్తిన హరినా థ్ గౌడ్ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ రహమతుల్లా బేగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, పోలీసు, విద్యుత్, వైద్య శాఖ, అధికారులు పాల్గొన్నారు.

# రెజ్లింగ్ లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుడు ముఫాజిల్ అహ్మద్



కరీంనగర్, మే25 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో సీఎం కప్ లో భాగంగా జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను జిల్లా యువజన క్రీడా ఆఫీసర్ రాజ్ వీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం నిర్వహించిన పోటీలలో శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ ముఫాజిల్ అహ్మద్ 84 కిలోల బరువు విభాగంలో గెలుపు పొంది, రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ సెక్రెటరీ గాసిరెడ్డి జనార్దన్ రెడ్డి , రెజ్లింగ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ రెడ్డి, ఎండి కరీంలు క్రీడాకారుడు అహ్మద్ ను అభినందించారు. ఈ పోటీలకు ఇంఛార్జిగా పీఈటీ రమణ, సీనియర్ క్రీడాకారుడు పూర్ణ సాయి అఖిల్, తదితరులు ఉన్నారు.

# ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

## -తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ

రాజన్న సిరిసిల్ల, మే25:(నేటి నిజం ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్రంలోని 36 లక్షల మంది,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమని, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం వేములవాడ పట్టణంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖను సందర్శించారు . ఖాతాదారులు లతోమాట్లాడారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మార్చి 31 2023 వరకు 25 కోట్ల లక్ష్యం చేరుకున్నట్టు తెలిపారు.రాష్ట్రంలోని 8 రీజియన్లు, 427 బ్రాంచీలు 1700 మంది సిబ్బంది తమ ఖాత దారులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు.తమ బ్యాంక్ లో అటల్ పెన్షన్ బీమా యోజన, డిజిటల్ లావాదేవీలు ఉపయోగించడంలో బ్యాంకుకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు వచ్చాయన్నారు.

ఈ సమావేశంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ బ్యాంక్,వేములవాడ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్వ్ మానస, ఫీల్డ్ ఆఫీసర్ బి సంతోష్ కుమార్, క్యాషియర్ శ్రావణి, మౌనిక, ఆఫీసర్ రవళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వివోఏల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

## -ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు



రాజన్న సిరిసిల్ల, మే25:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద వివోఏలు చేస్తున్న సమ్మె గురువారం 20వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వివోఏల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు గాజుల పోశెట్టి, ఏడీసీసీ నాయకులు శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ వీవోఏల సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతోమంది నిరుద్యోగులు, ఉద్యోగులు భవిష్యత్తు బాగుపడుతుందని అనుకుంటే ఏమీ మరలేదన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. ఉద్యోగులను రోడ్డుమీద సమ్మెలు చేసే పరిస్థితికి తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వంకు దక్కుతుందన్నారు. ఇకనైనా వీవోఏలకు పని భద్రత, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, 26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

# ఎంసెట్-2023 ఫలితాలలో 'అల్ఫోర్స్' విజయ కేతనం

## -విద్యాసంస్థల ఛైర్మన్ డా. వి నరేందర్ రెడ్డి

కరీంనగర్, మే25 (నేటినిజం ప్రతినిధి): ఎంసెట్-2023 ఫలితాలలో 'అల్ఫోర్స్' విజయ కేతనంవిద్యాసంస్థల ఛైర్మన్ డా. వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన



మాట్లాడుతూఎంసెట్-2023 ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, ర్యాంకులు సాధించారని కొనియాడారు. ఇందులో యమ్ అభిరామ్ 301 ల్వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. ఏ ఇషాంత్ రెడ్డి 322, బి శ్రీగోధ 356, జి జ్యోతి 374, టి దీపిక 446, యమ్ చిన్మయ్ 542, బి శ్రీనివాస్ 650, యస్ సాయిసధిష్ట 681, కె ప్రణిత రెడ్డి 752, హస్వితరెడ్డి 818, బి విద్యాలక్ష్మి 821, ఎస్ ధీరజ్కుమార్ 833, ఎన్ మనస్విని 865, అర్ సుహాసిత 893వ ర్యాంకు సాధించారని తెలిపారు.

14 మంది విద్యార్థులు 1,000 లోపు ర్యాంకు సాధించడం విశేషం అన్నారం 40 మంది విద్యార్థులు 2,000ల లోపు ర్యాంకులు, 63 మంది విద్యార్థులు 3,000ల లోపు ర్యాంకులు, 118 మంది విద్యార్థులు 5,000 లోపు ర్యాంకులు సాధించి, అల్ఫోర్ కీర్తి ప్రతిష్టలను దశదిశలా చాటారని పేర్కొన్నారు. విద్యార్థులు చేత అత్యధిక అత్యద్భుత ర్యాంకులు సాదించేలా కృషి చేయడం అల్ఫోర్స్ కు మాత్రమే సాధ్యమని అన్నారు. ఈ మధ్య ప్రకటించిన ఐఐటీ ఎమ్ మెయిన్స్ ఫలితాలలో కూడా అల్ఫోర్స్ చారిత్రాత్మక విజయం సాదించిందని, 450 మంది విద్యార్థులు ఐఐటీ (అడ్వాన్స్ )కు అర్హత సాదించడం అల్ఫోర్స్ మరో సంచలనం అన్నారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోదన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషివల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘనవిజయాలు సాదించగలుగుతుందని స్పష్టం చేశారు. రాబోయే నీట్ ఫలితాలలో కూడా అల్ఫోర్స్ మహె?న్నత ర్యాంకులతో ముందంజలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంసెట్-2023 ఫలితాలలో ర్యాంకులు సాధించిన "అల్ఫోర్స్" విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆగని చీతాల మరణాలు - ఆగ్రహిస్తున్న జంతు ప్రేమికులు

న్యూఢిల్లీ, మే25 మధ్యప్రదేశ్ లోని కునో జాతీయ పార్కు లో చీతాల వరుస మరణాలు కలవరపరుస్తున్నాయి. మంగళవారమే ఓ చీతా కూన మృత్యువాత పడగా, రెండు రోజుల వ్యవధిలోనే తాజాగా మరో రెండు చీతా కూన లు చనిపోయినట్లు అధికారులు ప్రకటించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, డీహైడ్రేషన్ కారణంగానే అవి మృతి చెందినట్లు తెలిపారు. నమీబియా , దక్షిణాఫ్రికాల నుంచి తీసుకొచ్చిన చీతా ల్లో ఇప్పటికే మూడు మరణించగా.. తాజా ఘటనల్లో మూడు చీతా కూనలు మృత్యువాతడ్డాయి

# సాధారణ కాన్పు మహిళలకు ఉయ్యాలల పంపిణీ

## -మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రావు



రాజన్న సిరిసిల్ల, మే25:(నేటి నిజం ప్రతినిధి): వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మొదటి కాన్పులో నార్మల్ డెలివరీలో ఆడ బిడ్డలకు జన్మనిచ్చిన నందగిరి రవళి, మానస, రోమాల శిరీష, నగ్మలకు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్ రావు గురువారం ఉయ్యాలలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ దవఖానలో సాధారణ కాన్పులు మరింత పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ఏరియా ఆసుపత్రి వేములవాడలో నార్మల్ డెలివరీ లను ప్రోత్సహించడం కోసం మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ అయి, ఆడపిల్ల జన్మిస్తే వారికి ఉయ్యాల అందజేయడం జరుగుతుందన్నారు. ఏరియా ఆసుపత్రి సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భవతులందరూ ఏరియా ఆసుపత్రికి వచ్చి, నెలనెల చెకప్ చేసుకోవాలన్నారు. నార్మల్ డెలివరీ కోసం అవసరమైన యోగ, ఎక్ససైజ్ నేర్చుకోవడం వల్ల సాధారణ ప్రసవం అయ్యే అవకాశాలు ఎక్కువ ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చైతన్య సుధా, తిరుపతి, సంతోష్, దీప్తి, బిందు, స్టాఫ్ నర్స్ భాగ్య, అరుణ్ సాయిజ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# జీ20 ప్రతినిధుల కోసం 'ది బెంగళూరు స్టోరీ' పేరిట నగర పర్యటన, సాంస్కృతిక కార్యక్రమం నిర్వహణ

బెంగళూరు,మే25: బెంగళూరులో జరిగిన 2వ 'ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్మెంట్ వర్కింగ్ గ్రూప్' (టీఐడబ్ల్యూజీ) సమావేశంలో పాల్గొన్న జీ20 ప్రతినిధుల కోసం, నిన్న సాయంత్రం, 'ది బెంగళూరు స్టోరీ' పేరిట నగరంలో బస్ యాత్ర, కర్ణాటక సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగళూరు నగరం, నగరంలోని అందమైన ఉద్యానవనాలు, సిలికాన్ వ్యాలీగా పేరు సాధించిన బెంగళూరు ఘనతను గురించి అవగాహన కల్పించడం ఈ పర్యటన ఉద్దేశం.

బెంగళూరు రాజప్రాసాదంలో, రాచరిక నిర్మాణ కౌశలాన్ని చాటి చెప్పే బురుజులు, తోరణాలు, బలమైన కట్టడాలను ప్రతినిధులు వీక్షించారు. ఇంగ్లండ్లోని విండ్సర్ కోట స్ఫూర్తితో దీనిని నిర్మించారు. కోటలో ఉన్న భారీ బహిరంగ ప్రాంగణం కర్ణాటక సుదీర్ఘ సాంస్కృతిక, చారిత్రక, సంగీత వారసత్వానికి నిదర్శనంగా నిలిచింది. మ్యూజియం ఆఫ్ ఆర్ట్ అండ్ ఫోటోగ్రఫీ, కబ్బన్ పార్క్, విధాన సౌధను కూడా ప్రతినిధులు సందర్శించారు. మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర బృంద ఫోటో కార్యక్రమంతో నగర పర్యటన ముగిసింది. 'ది బెంగళూరు స్టోరీ'ని కర్ణాటక పర్యాటక శాఖ రూపొందించింది. 2వ టీఐడబ్ల్యూజీ సమావేశం మొదటి రోజు సాంస్కృతిక కార్యక్రమం, పసందైన విందుతో ముగిసింది. కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, నృత్య రూపాలను సాంస్కృతిక కార్యక్రమంలో ప్రదర్శించారు. కళానిధి నృత్య మందిరం, స్పేస్ కథక్, శ్రీ నాట్య నికేతన్ ఈ ప్రదర్శనలు ఇచ్చాయి.

# నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం



ఖమ్మం, మే25: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్ లోని రెస్ట్ ఇన్ హోటల్ నందు ఖమ్మం గ్రానైట్ టైల్స్ అండ్ పాలిషింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఖమ్మం నగర మేయర్ పునుకోలు నీరజ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఖమ్మం సుడా ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్ లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం ఖమ్మం గ్రానైట్ టైల్స్ అండ్ పాలిషింగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథులకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, ఖమ్మం గ్రానైట్ టైల్స్ అండ్ పాలిషింగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మరియు గ్రానైట్ ఫ్యాక్టరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వారిని బీజేపీలోకి ఆహ్వానించారా? లేక వారే ఈటలనే ఆహ్వానించారా?

హైదరాబాద్ మే 25 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నగర్కర్నూలు జిల్లాకు చెందిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏ పార్టీలో చేరబోతున్నారు?.. లేదా సొంతంగా పార్టీని స్థాపించబోతున్నారా? అనే చర్చ కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ శివార్లలో ఫామ్హౌస్లో ఈటల రాజేందర్, పొంగులే, జూపల్లి మధ్య రహస్య భేటీ జరుగుతోంది. ఈటలకు చెందిన ఈ ఫామ్హౌస్లో దాదాపు 4 గంటలకుపైగా సమయం నుంచి ఈ సమావేశం కొనసాగుతోంది. అనుచరులు, అనుయాయులు, కనీసం సెక్యూరిటీ సిబ్బంది కూడా లేకుండా అత్యంత రహస్యంగా ఈ భేటీని కొనసాగుతున్నారు. దీంతో ఈ సమావేశంపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఇంత సీక్రెట్గా సమావేశమవడానికి గల కారణాలు ఏంటనే దానిపై చర్చ మొదలైంది.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులను బీజేపీలోకి తీసుకొచ్చేందుకు బీజేపీ నాయకత్వం పట్టువిడవకుండా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా గురువారం రహస్య భేటీకి కారణమనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఈటల రాజేందర్ నేతృత్వంలోని బీజేపీ చేరిక కమిటీ ఇదివరకే ఖమ్మం వెళ్లి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో సంప్రదింపులు జరిపింది. అప్పుడు అందరి ముందు బహిరంగంగానే చర్చలు జరిగాయి. ఆలోచించుకుని తర్వాత నిర్ణయం చెబుతామని వారిద్దరూ స్పష్టం చేశారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న సమావేశం అత్యంత రహస్యంగా జరుగుతుండడమే రాజకీయంగా ఆసక్తికలిగించడానికి కారణమవుతోంది. వారిద్దరినీ పార్టీలోకి ఆహ్వానించేందుకు ఈటల చర్చలు జరుపుతున్నారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. కానీ... పొంగులేటి, జూపల్లి కొత్త పార్టీ పెట్టబోతున్నారని, ఇందులో భాగం గానే ఈటలను రహస్యంగా కలిశారా? అనే ఊహాగానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. మరి నిజంగా వీరిద్దరినీ ఈటల బీజేపీలోకి ఆహ్వానిస్తున్నారా? లేక ఈటలనే తమ కొత్త పార్టీలోకి ఆహ్వానించారా? అనే ఆసక్తికర విషయాలపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

దూకుడు పెంచిన ఈటల...

ఈటల రాజేందర్ కొన్నిరోజుల కింద ఢిల్లీ వెళ్లి పార్టీ జాతీయ నాయకులు నడ్డా, సునీల్ బన్సల్ను కలిసి వచ్చాక దూకుడు పెంచారు. వాస్తవానికి చేరికల కమిటీగా హెడ్గా ఈటల దాదాపు ఏడాదిగా కొనసాగుతున్నప్పటికీ నాయకత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. ఈ విషయంలో అధిష్ఠానం సీరియస్గా ఉందని చర్చ నడుస్తోంది. ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంటి నాయకుడిని వదులుకోవడానికి అధిష్ఠానం ఏమాత్రం ఇష్టపడడం లేదని సమాచారం. దీంతో పొంగులేటి, జూపల్లి డిమాండ్లకు ఏదో విధంగా ఒప్పించి పార్టీలో చేర్పించే దిశగానే ఈటల సంప్రదింపులు జరుపుతున్నట్టు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పార్టీ అధిష్ఠానం నుంచి బలమైన హామీ వచ్చిన నేపథ్యంలో గత 4 గంటలుగా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ నేతలిద్దరి అడుగులు ఏ పార్టీవైపు పడుతున్నాయన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. మరీ ముఖ్యంగా కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, వారి డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ కూడా అంగీకారం తెలిపిందని పెద్ద చర్చ నడిచింది. మరి ఈ రహస్య భేటీలో ఏం జరుగుతుందో వేచిచూడాలి.

# వధూవరులను ఆశీర్వదించిన డిసిసిబి డైరెక్టర్ మల్లిబాబుయాదవ్



ఖమ్మం, మే25: (నేటినిజం ప్రతినిధి): కారేపల్లి మండలం గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన పల్లపాటి వెంకటేశ్వర్లు యాదవ్-మల్లమ్మ దంపతుల కుమారుడు రామకృష్ణ యాదవ్- లావణ్యల వివాహ కార్యక్రమంలోడిసిసిబి డైరెక్టర్, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో చల్లగా జీవించాలని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వెంకట్, ఉపేందర్, బెల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పారాచూట్ అడ్వాన్స్డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ టీవీసీ విడుదల




నెల్లూరు, మే 25, 2023: మారికో లిమిటెడ్ ప్రీమియం హెయిర్ నరిష్మెంట్ బ్రాండ్ పారాచూట్ అడ్వాన్స్డ్ తన పారాచూట్ అడ్వాన్స్డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ హృదయాన్ని హత్తుకునే టీవీసీని విడుదల చేసింది. జుట్టు పెరుగుదలను పెంచడానికి, జుట్టు రాలడాన్ని తగ్గించడానికి కొబ్బరి, ఉల్లిపాయ అనే రెండు శక్తివంతమైన పదార్థాలు కలిసి ఎలా పని చేస్తాయో? ఈ టీవీసీ హైలైట్ చేస్తుంది. ఈ చిత్రంలో కుమార్తె, ఆమె తల్లి మధ్య విడదీయరాని, ప్రత్యేకమైన బంధాన్ని చూపుతుంది. తల్లి తన కుమార్తెకు రాబోయే వివాహం, ఆమె జుట్టు భవిష్యత్తు కోసం మార్గనిర్దేశం చేస్తుంది. త్వరలో పెళ్లి కాబోతున్న కూతురు, ఆమె తల్లికి మధ్య జరిగే ప్రేమ సంభాషణతో, పెళ్లి తర్వాత బాధ్యతల్లో మార్పు సందర్భాలతో ఈ చిత్రం తెరకెక్కింది. స్నేహపూర్వకంగా, ఆమె చెల్లెలు కూడా తన అక్కను పరిహసిస్తూ, జుట్టు రాలడంతోపాటు కొత్త జీవితం తీసుకొచ్చే వివిధ మార్పులపై మాట్లాడుతుంది. ఈ సందర్భంగా మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ మాట్లాడుతూ పారాచూట్ అడ్వాన్స్డ్ తరతరాలుగా మహిళలకు విశ్వాసపాత్రంగా ఉంటూ వస్తోందన్నారు. ఒక తల్లి-కూతురు సంబంధం నిజంగా ప్రత్యేకమైనదన్నారు. ఒక కూతురు తన తల్లిని ఆమె అత్యంత విశ్వసనీయ సలహాదారుగా చూస్తుందని తెలిపారు. తల్లి తన బిడ్డకు ఉత్తమమైన వాటిని మాత్రమే కోరుకోవడం అసమానమైనదన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ హన్స్ సక్సేనా మాట్లాడుతూ పారాచూట్ అడ్వాన్స్డ్ భారతదేశం అంతటా చాలా విశ్వసనీయమైన ఇష్టపడే బ్రాండ్ అన్నారు. పారాచూట్ అడ్వాన్స్డ్ ఆనియన్ హెయిర్ ఆయిల్ కోసం షూటింగ్ చేస్తున్నప్పుడు, కొబ్బరి ఉల్లి రెండు శక్తివంతమైన పదార్థాల ప్రయోజనాలను బయటకు తీసుకువచ్చేటప్పుడు వినియోగదారుని ప్రతిధ్వనించే భావోద్వేగాన్ని అర్థం చేసుకోవడం క్యాప్చర్ చేయడం చాలా ముఖ్యమని తెలిపారు.

# నేడు టీయుడబ్ల్యుజే (ఐజేయు) జిల్లా కార్యవర్గ ఎన్నిక



రాజన్న సిరిసిల్ల, మే25:(నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఐజెయు రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ద్వితీయ మహాసభ, నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 26 తేదిన ఉదయం 10 గంటలకు వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్లో జరగనున్నట్లు బుధవారం వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పుట్టపాక లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునియన్ రాష్ట్రశాఖ అధ్యక్షులు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి విరాహత్అలీ, ఉపాధ్యక్షుడు తాడూరి కరుణాకర్ లు ఈ ఎన్నికకు హాజరవుతారని తెలిపారు. ఈ ఎన్నికలలో 13 మండలాలకు చెందిన పాత్రికేయులు పాల్గొననున్నారని, కావున ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఇట్టి మహాసభ, ఎన్నికల్లో పాల్గొని, విజయవంతం చేయాలని వేములవాడ ప్రెస్ క్లబ్ (ఐజెయు) కార్యవర్గం తరపున విజ్ఞప్తి చేశారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.